# సంపాదకీయం



స్వాతంత్ర్యం వచ్చిందని సభలు పెట్టుకొని, శెలవుదినాన్ని ప్రకటించుకొని సంబరపడుతున్నాం. ప్రజాస్వామ్య దేశమని, సుసంపన్నమైన దేశమని గర్వపడుతున్నాం. 70 సంవత్సరాల ఈ స్వతంత్ర్య భారతదేశంలో రాజకీయ కుతంత్రాలు, మారణహోమాలు, కులమత విబేధాలు, దురాలోచనలు, దుష్ప్రచారాలు, సామాన్యుడిని దోచుకునే ప్రయత్నాలు.... ఇదేనా స్వాతంత్ర్యం? ఇదేనా స్వేచ్ఛ? దీనికి కారణం మనం కాదా? మన వ్యక్తిగత స్వార్థం కాదా? దేశం మనకు ఏమి ఇచ్చింది. వాళ్ళు, వీళ్ళు మనకేమి చేశారు అని నిందించడం తప్ప, దేశం కోసం, ప్రక్కవాడికోసం మనమేమి చేస్తున్నాం? బాధ్యతాయుతముగా నడచుకుంటున్నామా? అవినీతిని, అన్యాయ అక్రమాలను రూపుమాపడానికి ప్రయత్నిస్తున్నామా?

ఏది మంచి, ఏది చెడు అని గ్రహించగలశక్తిని దేవుడు మనకిచ్చాడు. మంచి చేసినప్పుడు ఆనందం కలుగుతుంది. చెడు తలపెట్టినప్పుడు ఆత్మ శోధనకు గురవుతుంది. తప్పుచేశామన్న బాధ మనలను తడుతూ ఉంటుంది. ఈ రెండింటి మధ్య పోరాడుతున్న మనిషి ఏ విధంగా మంచిపై పై చేయిలో ఉండగలడు? నిర్మలమైన మనస్సు ఉన్నప్పుడే! సహోదర ప్రేమ ఉన్నప్పుడే! దేవుడిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయనప్పుడే!

ఆనందనాన్ని ఎవరు కోరుకోరు? స్వేచ్ఛను ఎవరు వదలుకుంటారు? కానీ ఏది నిజమైన ఆనందం, ఏది నిజమైన స్వేచ్ఛ అని తెలుసుకోలేని అయోమయస్థితిలో జీవిస్తున్నాం! కొన్నిడబ్బులు చేతిలో ఉంటే, అధికారం మనసొంతమైతే, విలాసవంతంగా జీవిస్తే అదే ఆనందం అనుకుంటున్నాం. నలుగురిని ఎదిరిస్తే, సొంతపెత్తనం చెలాయిస్తే అదే స్వేచ్ఛ అనుకుంటున్నాం!

ఈ తరుణంలో "భౌతికమైన ఆనందం – ఆధ్యాత్మికమైన ఆనందం" గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఏది శాశ్వతమో తెలుసుకొని, దానిని పాటించే ధైర్యం కూడా చేయాల్సిన అవసరం ఉంది. ఒక కప్పు ఐస్ క్రీమ్ తింటే తృప్తిని, హాయిని, క్షణికమైన ఆనందాన్ని పొందుతాం. అదే ఒక గ్రుక్కెడు మంచినీరు దాహంతో

ఉన్నవారికి ఇచ్చినప్పుడు కలిగే ఆనందం చెప్పనలవికానిది. ఆత్మీయ సంతృప్తిని పొందుతాం. ఇదే శాశ్వతమైన ఆనందం ఇదే ఆధ్యాత్మికం.

పునీత పౌలు గలతీయులకు వ్రాసిన లేఖలో ఇలా అంటారు. "మీరు ఆత్మయందు నడుచుకొనుడు. శరీర వాంఛలను తృప్తి పరచుటకు యత్నింపకుడు... (గలతి 5:16–26). ఇక్కడ పునీత పౌలు భౌతికమైన ఆనందాన్ని ఇచ్చే కొన్ని శరీర కార్యాలను ప్రస్తావిస్తాడు. ఉదా: త్రాగుబోతు తనము, విందులు వినోదాలు.. మొదలైనవి. ఇవేమి మనకు శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేవు. దేవుడు ఒక్కడే శాశ్వతమైన ఆనందానికి మూలం. ప్రతి మనిషికి ఎంతసంపాదించినా, ఏదోఒకలోటు ఉంటుంది. ఏదో కోల్పోయాము అన్న చింతన ఉంటుంది. ఏదైతే కోల్పోతున్నాము అనుకుంటామో అదే ఆధ్యాత్మికం. ఈ ఆధ్యాత్మిక ఆనందం దేవునిలోనే కనుగొంటాము. దేవుడే ఇస్తాడు. ఎలా? దేవుడు మనిషికిచ్చిన స్వేచ్ఛను ఉపయోగించి, ఆత్మ సంబంధమైన క్రియలను చేసినప్పుడు. ఉదాహరణకు, మంచితనముతో జీవించడం, నిగ్రహము కలిగి ఉండడం – ప్రేమ, సహనం కలిగి ఉండడం మొదలుగునవి.

దేవుడిచ్చిన స్వేచ్ఛతో మంచికార్యానికి పూనుకొన్నది మరియతల్లి. రక్షణ ప్రణాళికలో మానవ సహకారం అవసరమైనప్పుడు నేను సిద్ధంగా ఉన్నానంటూ తన జీవితాన్ని అర్పించింది. దేవుని ప్రణాళికను అంగీకరించి మరణం వరకు సంపూర్ణముగా నెరవేర్చింది. ఆత్మీయ ఆనందాన్ని పొందింది. మోక్షానికి ఎత్తబడింది. ఆమె త్యాగం చిరస్మరణీయం! ఆమె ఆదర్శం మార్గదర్శకం.

**స్వాతంత్ర్య దినోత్సవ మరియు**
**మరియమాత మోక్షారోపణ పండుగ శుభాకాంక్షలతో...**



**ఫా. దామాల విజయ కుమార్**
**ఎడిటర్**

# యేసు దివ్యరూపధారణ మహోత్సవం
## 06-08- 2017

- ఫా. దామాల విజయ కుమార్, పాస్టరల్ సెంటర్

**దానియేలు 7:9-10; 13-14 *2పేతురు 1:16-19* మత్తయి 17:1-9**

**ఉపోద్ఘాతము**

మనిషి జీవితంలో ప్రతిక్షణం విలువైనది. దురదృష్టవశాత్తు, చాలా సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నాం. సమయం యొక్క విలువను తెలుసుకోలేకపోతున్నాం. కానీ దేవుడు మానవరక్షణ కార్యంలో ఒక్క క్షణం కూడా వృథాచేయడు. ఒక్కక్షణం దేవుడు మన గురించి ఆలోచించడం మానివేస్తే బ్రతకగలమా!

సమయం విలువైనది అని మనం గ్రహించగలిగినప్పుడు, క్రీస్తు ఈ లోకంలో జీవించిన సమయం అతి పవిత్రమైనది, అత్యంత విలువైనది అని కూడా గ్రహించాలి. క్రీస్తు జీవితాన్ని పరిశీలించినప్పుడు కొన్ని ముఖ్యమైన ఘట్టాలు మనకు కనిపిస్తాయి. **ఉదాహరణకు:** ఆయన జననం, బాప్తీజం, శోధనలు, అద్భుతాలు, యెరుషలేము ప్రవేశము, శ్రమలు, మరణం, ఉత్థానం మరియు మోక్షారోహణం. ఇలాంటి ముఖ్యమైన ఘట్టాలలో “దివ్యరూపధారణ” కూడా ఒకటి. ఇది క్రీస్తు జీవితంలో అత్యంత ప్రధానమైన ఘట్టము. కాబట్టే ఈ సంఘటనను ముగ్గురు సువార్తీకులు (మత్తయి, మార్కు, లూకా) చాలా వివరంగా ప్రస్తావించడం జరిగింది.

**వివరణ:**

పైన ప్రస్తావించిన మూడు సువార్తల ప్రకారం క్రీస్తు , పేతురు, యోహాను, యాకోబులను తన వెంట తీసుకొని ఒక ఉన్నతమైన పర్వతంపైకి (తాబోరు) వెళ్ళారు. లూకాగారు మాత్రం వాళ్ళు వెళ్ళిన ఉద్దేశం “ప్రార్థన చేసుకొనుటకు” అని తెలియజేస్తున్నారు (లూకా 9:28-29)

**ఎ. రూపాంతరం:**

**మూడు సువార్తల ప్రకారం:** క్రీస్తురూపంలో మార్పు కనిపించింది. ఆయన ముఖంలో సూర్యునివలే ప్రకాశించింది. (మత్తయి 17/2) ఆయన దుస్తులు వెలుగువలే ప్రకాశించాయి (మార్కు 9/3).

పూర్వవేదంలో నిర్గమ కాండంలో దైవదర్శనం జరిగిద మోషే పది ఆజ్ఞల పలకలతో క్రిందికి వచ్చేటప్పుడు ఆయన ముఖం కాంతివంతం అవడం ఇశ్రాయేలు ప్రజలు చూశారు. (నిర్గమ 34:29). కానీ క్రీస్తు విషయంలో ఎవరి ద్వారానో వచ్చిన

తేజస్సుకాదు. తనంతట తానే రూపాంతరం చెందాడు. తనకు తానే ప్రకాశవంతుడయ్యాడు. ఈసంఘటన తాను దైవకుమారుడని, తన దైవత్వాన్ని వారిముందు చూపించాడని తెలియపరుస్తుంది.

**బి. ఎలిషా మోషేలతో సంభాషణ:**

ముగ్గురు సువార్తాకారులు ఈ విషయాన్ని ప్రస్తావించినా, లూకా గారు మాత్రం వారి సంభాషణ సారాంశాన్ని తెలియపరుస్తాడు. అది ఏమిటంటే యెరుషలేములో క్రీస్తు మరణించివలసిన విషయం గూర్చి, ఆయయనతో మరలా సజీవంగా తిరిగి లేస్తాడు అని కూడా సంభాషించినట్లు లూకా తెలియజేస్తాడు.

మోషే, ఏలియాలు మాత్రమే ఎందుకు? వేరేవారు ఎందుకు కాకూడదని మనకు అనుమానం రావచ్చు. పూర్వవేదంలో మోషే యూదుల చేత ఎక్కువగా గౌరవించబడిన నాయకుడు. వారిని ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించి వాగ్దాన భూమికి నడిపించిన వాడు. తన జీవిత చివరిదశలో మెస్సయా రాకను ప్రకటించిన వ్యక్తి. (ద్వితియో 18:15). క్రీస్తు ఈ లోకంలో జన్మించడానికి ప్రధానమైన కారణం. పాప బంధాలలో చిక్కుకున్న మానవాళిని విముక్తులను చేయడం కోసం. బానిసత్వపు బ్రతుకులకు తెరలేపి దైవరాజ్య వారసులను చేయడానికి. ఈ రూపాంతర ఘట్టంలో మోషే కనిపించడం అనేది, ఒక నాయకుడు ఇంకొక నాయకుడికి బాధ్యతను అప్పగించడాన్ని మోషే ఇశ్రాయేలు ప్రజలను వాగ్ధాన భూమికి నడిపినట్లు క్రీస్తు సకల మానవాళిని పరలోకం వైపు నడిపిస్తాడని అర్థం.

ఎలియా కూడా యూదుల చేత గౌరవించబడిన ఒక గొప్ప ప్రవక్త. ఎలియా ప్రవక్తనుగూర్చి మలాకి గ్రంథంలో చెప్పబడిన ప్రవచనాన్ని యూదులు తమ మనసుల్లో ముద్రించుకున్నారు. అది ఏమిటంటే మెస్సయాకు ముందు ఏలియా ప్రవక్త వస్తాడని మెస్సయాను పరిచయం చేస్తాడని (మలాకి 3:23-24). క్రీస్తే స్వయంగా ఈ విషయాన్ని తన అపోస్తులులతో ప్రస్తావిస్తాడు. (మత్తయి 17:9-13). ఇది బాప్తిస్మ యోహాను ద్వారా నెరవేరుతుతంది. ఏలియా ప్రవక్తతో సంభాషణ, ప్రవక్తలందరు మెస్సయా గురించి పలికిన ప్రవచనాలు అన్నీ క్రీస్తులో నెరవేరాయి అన్న సత్యాన్ని ప్రకటిస్తుంది. అంతేకాక ఏలియా ఏవిధంగా అద్భుతంగా మోక్షానికి కొనిపోబడ్డాడో అలాగే క్రీస్తుకూడా తన మహిమతో మోక్షానికి ఎక్కి వెళ్తాడు అని భావాన్ని కూడా వీరి సంభాషణ తెలియజేస్తుంది.

**సి. తండ్రి స్వరం:**

"ఈయన నాప్రియమైన కుమారుడు, ఈయనను ఆలకించండి" (లూకా 9:35) తండ్రి దేవుడే స్వయంగా తనకుమారుడైన క్రీస్తుయొక్క ఉనికిని ప్రకటిస్తున్నాడు. తన

ఉద్దేశ్యాన్ని నెరవేర్చడానికి వచ్చిన వాడని, తన అనంతమైన ప్రేమలో పాపంలో పడిన మానవాళిని తన కుమారుని ద్వారా రక్షిస్తానని, తన నివాసంలో చేర్చుకుంటానని ప్రకటిస్తున్నాడు.

**డి. పేతురు, యోహాను, యాకోబు:**

వీరిని మాత్రమే క్రీస్తు ఎందుకు తన వెంట తీసుకొని వెళ్ళాడనే సందేహం మరలా కలుగవచ్చు. ఇక్కడే కాదు వేరే సందర్భాలలో కూడా ఈ ముగ్గురు ప్రత్యేకంగా క్రీస్తుతో ఉన్నట్లు సువార్తల్లో చదువుతాం! తెలుసుకుందాం!

**పేతురు:** "ప్రభూ! మేము ఎవరివద్దకు పోయెదము నీవు నిత్యజీవమైన మాటలు కలవాడవు", "నీవు సజీవుడైన దేవుని కుమారుడవగు క్రీస్తువు" అని ప్రకటించిన పేతురు కొన్ని సందర్భాలలో తన పిరికితనాన్ని, అవిశ్వాసాన్ని వ్యక్తపరుస్తాడు. మనుష్య కుమారుడు శ్రమలను అనుభవించాలి, మరణించాలి అని క్రీస్తు చెప్పినప్పుడు "ప్రభూ ఇలాంటివి ఎప్పటికి సంభవింపకుండునుగాక" అని చెప్తాడు. అంటే తమ నాయకుడైన క్రీస్తుకు ఇలాంటివి సంభవిస్తే తమకు కూడా తప్పకుండా వస్తాయని ఆయన భావన. అందుకే తప్పించే ప్రయత్నం చేస్తున్నాడు. "క్రీస్తు బాధలలో పాలు పంచుకోకపోతే ఆయన మహిమలో కూడా పాలు పంచుకోలేము" (రోమి 8:17) అన్న సత్యాన్ని గ్రహించలేకపోయాడు. పునాదే దృఢంగా లేకపోతే, కట్టడం నిలువదు కదా! క్రీస్తు తన సంఘాన్ని పేతురుపై నిర్మించే ఉద్దేశ్యంతో, పేతురు విశ్వాసాన్ని పరిపూర్ణం చేయడానికి, తన జీవితంలో జరిగిన కీలకమైన సందర్భాలలో తనవెంట తీసుకొని వెళ్ళి తాను దేవుని కుమారుడని, ఈ లోకంలో అధికారం కాదు, దైవరాజ్యాన్ని నిర్మించడానికి వచ్చానని తెలియజేస్తున్నాడు.

**యోహాను, యాకోబులు:**

మార్కు 10:35-37, తమత్తయి 20:20-21 వచనాల ప్రకారం, యోహాను, యాకోబులు ఈ లోక సంబంధమైన అధికారాన్ని ఆశించినట్లుగా అనిపిస్తుంది. నిజానికి క్రీస్తు, ప్రేమ, నీతి, న్యాయాలతో కూడిన దేవుని రాజ్యాన్ని స్థాపించడానికి ఈ లోకానికి వచ్చాడు. అదే విషయాన్ని చాలాసార్లు వారిమధ్య ప్రస్తావించాడు. కానీ వారు దానిని సరిగా అర్థంచేసుకోలేక పోయారేమో! దైవరాజ్యములో గొప్పవాడు కాదలచిన వాడు తనను తాను తగ్గించుకొని, సేవకుడై ఉండాలని క్రీస్తే తన జీవితం ద్వారా చూపించిన ఆదర్శాన్ని గ్రహించలేక పోయారేమో! అందుకే వారి ఉద్దేశాలనుండి వారిని పవిత్రపరచడానికి అధికారం కాదు, సేవాభావంతో జీవించాలని, ఫలితంగా దైవరాజ్య వారసత్వాన్ని పొందుతారని తెలియజేయడానికి వారిని తనతో తీసుకొని వెళ్ళి ఉంటారు.

**ఇ. ధ్యానం:**

చాలా సందార్భాలలో మనం పేతురు, యోహాను, యాకోబుల మనస్తత్వంతో జీవిస్తున్నాం. కష్టాలు రాకూడదని, వచ్చినప్పుడు దేవుడు ఎందుకు ఇచ్చాడని, అధికార వ్యామోహాలతో, ప్రథమ స్థానాలను క్షాంక్షిస్తూ, క్రీస్తు మనస్తత్వానికి వ్యతిరేకంగా జీవిస్తున్నాం. ఈ తరుణంలో పునీ తపౌలు మనందరికి ధైర్యాన్ని ఇస్తూ ఇలా వ్రాస్తున్నాడు. “ఇప్పుడు మనం పడుచున్న కష్టములు మనకు ప్రత్యక్షము చేయబడనున్న మహిమతో ఎంత మాత్రమూ పోల్చతగినవి కావు” (రోమా 8:18). తన దైవత్వంలో మనలను బాగస్తులను చేయడానికే క్రీస్తు ఈ లోకానికి వచ్చాడు. తన జీవితం అవమానాలతో, బాధలతో, సిలువ మరణంతో అంతంకాదు. వాటిద్వారా దివ్యమహిమను, వైభవాన్ని పొందబోతున్నావని తెలియజేశాడు. అందుకే ఆయన ముఖం సూర్యునివలే, వస్త్రాలు వెలుగువలే ప్రకాశించాయి. తాను నీతిమంతునిగా జీవించి సైతానుపై విజయం సాధించబోతున్నానని తెలియజేశాడు. ఈలోక జీవితం శ్రమలతో కూడిన జీవితం. ఈ జీవితాన్ని చాలించిన తరువాత మహిమగల జీవితాన్ని పొందుతాం. రూపాంతర ఘట్టం ద్వారా క్రీస్తు అదే మనకు తెలియజేస్తున్నాడు.

**ముగింపు**

పనిలేకుండా ఫలితముండదు. శ్రమలేకుండా పురోభివృద్ధి వుండదు. కష్టం లేకుండా వైభవం ఉండదు. భూమిలో విత్తనం పడి నశించిననే తప్ప అది మొలకెత్తి పెరిగి ఫలించదు. చెమటోడ్చి విత్తనం వేయువాడే ఆనందంతో పంటను కోయగలడు. సోమరిపోతు ప్రగతి పథంలో ఎప్పుడూ పయనించలేడు. జీవితంలో కీర్తి కిరీటాన్ని పొందలేడు. అట్లే ఆధ్మాత్మిక జీవితంలో మహిమమను పొందాలంటే అనేక శ్రమలనుభవించక తప్పదు. యేసుతో ఐక్యమై జీవించువాడే ఆయన వైభవంలో పాలుపంచుకొనగలడు.

యేసు శ్రీసభకు తల. తల మహిమ పొందితే యేసు శరీరమై శ్రీసభ గూడ ఆ వైభవాన్ని పొందుతుంది. అనగా ప్రతి క్రైస్తవుడు యేసు దివ్యత్వంలో, మహిమలో పాలు పంచుకొంటాడు. అందుకు క్రైస్తవుడు యేసుతో ఐక్యమై ఉండి ఆయన మార్గంలో పయనించాలి. ఆయనవలె శ్రమలు, ఆవమానాలు, హింసలు పడి వైభవంలో పయనించాలి. ఆయనయందు, ఆయనతో మరణించేవాడే ఆయనతో పునరుత్థానుడై ఆయన మహిమలో చేరగలడు.

# సామాన్య 19వ ఆదివారం
# 13-08-2017

**1రాజులు 10:9,11-13 రోమీ 9:1-5 మత్తయి 14:22-33**

క్రైస్తవులందరికీ విశ్వాసం ఉంటుంది. అయితే ఎవరి విశ్వాసం బలమైనదో, ఎవరి విశ్వాసం బలహీనమైనదో తెలుసుకోవాలంటే అందుకు ఒక్కటే గీటురాయి. అదేమిటంటే ఎవరు యేసు ప్రభువు పట్లగల నమ్మకంతో తమకెదురయ్యే అన్ని భయాలను జయించగలుగుతారో ఆలాంటి వారికున్న విశ్వాసమే బలమైన విశ్వాసమని నిర్ధారించుకోవచ్చును.

అవును లోకంలో అందరికీ ఎదురైనట్లే క్రైస్తవుడికి కూడా జీవితంలో అనేక కష్టనష్టాలు, అరిష్టాలు, అవరోధాలూ ఎదురవుతాయి. భయపెట్టజూస్తాయి. కానీ, యథార్థమైన క్రైస్తవుడు వాటిని చూచి భీతిల్లడు, బెంబేలెత్తిపోడు, క్రీస్తు యేసు పట్ల తనకుగల విశ్వాసం చేత అతడు అన్ని భయాలనూ అధిగమించగలుగుతాడు, నిర్భయంగా ముందడుగు వేయగలుగుతాడు.

## మొదటి పఠనం: 1రాజులు 10:9,11-13

సోలొమోను రాజు మరణానంతరం అతడిరాజ్యం రెండు భాగాలుగా చీలిపోయింది. ఉత్తర భాగం ఇస్రాయేలు రాజ్యంగా అవతరిస్తే దక్షిణ భాగం యూదయా రాజ్యమయింది. యెరూషలేము నగరం యూదయాకు రాజధానిగా స్థిరపడింది.

ఆనతికాలంలోనే ఇస్రాయేలు దేశప్రజలు యథార్థమైన దేవుణ్ణి మరచిపోయారు, అన్యజాతుల దేవరలను ఆరాధించనారంభించారు. సాక్షాత్తూ ఇస్రాయేలు పాలకుడు ఆహాబు రాజు అన్యజాతీయుల యువతిని పరిణయమాడి పట్టమహిషిగా స్వీకరించాడు.

ఈ నేపథ్యంలో ఏలీయా ప్రవక్త రంగప్రవేశం చేశాడు. విశ్వాసభ్రష్టులవుతోన్న ఇస్రాయేలు ప్రజలను చూచి ఉగ్రుడయ్యాడు. అయితే దేశ మంతటిలో తానొక్కడే దేవునికి విశ్వాసపాత్రుడనని తలంచాడు. ఇలా అనుకొన్న ఏలీయా ప్రవక్త దేశంలో గణనీయమైన సంఖ్యలో ఉన్న నీతిమంతులు, విశ్వాసపాత్రులైన ఇస్రాయేలీయులకు కూడా దూరమై ఒంటరిగా మిగిలాడు. నిజానికి తనను ఇప్పటికీ విశ్వసిస్తూ, తన ఆజ్ఞలను నిష్ఠగా పాటిస్తోన్న ఈ కొద్దిపాటి ఇస్రాయేలు ప్రజలకు మార్గదర్శిగా నిలువడానికే దేవుడు ఏలీయాను పంపారు. కానీ ప్రవక్తగా వచ్చిన ఏలీయా దేశప్రజలంతా భ్రష్టులయ్యారన్న అపోహతో దైవవిధేయులకు సైతం దూరమయ్యాడు. ప్రవక్తగా తాను నిర్వర్తించవలసిన ప్రధాన ధర్మాన్నే విస్మరించాడు. దీనికి తోడు ఏలీయా శత్రువులు పగతో రగిలిపోతూ ఆయన్ని వెంటాడసాగారు. శత్రువుల బారిన పడకుండా తప్పించుకోవడానికి ఏలీయా హోరేబు కొండకు పలాయనమైపోయి అక్కడొక గుహలో తలదాచుకున్నాడు.

అక్కడ ఆ హోరేబు కొండమీదే దేవుడు ఒక చల్లనిగాలిలో ఏలీయాకు ప్రత్యక్షమై "మెల్లని స్వరము"తో ఆయనతో మాట్లాడారు. ఏలీయా ఒక్కడే నీతిమంతుడుకాదనీ, విశ్వాస పాత్రులైన ఇస్రాయేలీయులు 7000 మంది ఉన్నారని, ఏలీషా అనే నీతిమంతుడు మరొకరున్నారనీ దేవుడు తెలియజేశారు. అంతేకాదు ఇస్రాయేలీ ప్రజల మధ్యకు తిరిగి వెళ్ళి వారు తనతో చేసుకున్న ఒప్పందాన్ని పునరుద్ధరించుమని, చెదరిన వారి విశ్వాసాన్ని ప్రోదిచేసి తిరిగి వారిని ధర్మమార్గానికి మళ్ళించుమని చెప్పి పంపారు.

మొట్టమొదట దేవుడు ఈ హోరేబు కొండమీదనే మోషేకు దర్శనమిచ్చి ఇస్రాయేలీ ప్రజలతో తాను చేసుకున్న ఒప్పందాన్ని గురించి వెల్లడిస్తారు. (నిర్గమ 33:18-34) తిరిగి అదే హోరేబు పర్వతంమీద దేవుడు ఏలీయా ప్రవక్తకు ప్రత్యక్షమై, ఇస్రాయేలీయులతో ఆనాడు తాను చేసుకున్న ఒప్పందాన్ని పునరుద్ధరించుమని కోరడం విశేషం.

## రెండవ పఠనం: రోమీ 9:1-5

పునీత పౌలు సుమారు 24 సంవత్సరాల పాటు సువార్తా ప్రబోధం చేస్తూ సౌవార్తిక విలువల ప్రకారం జీవించాకనే రోమీయులకు ఈ లేఖ రాశాడు. ఈ పాతికేళ్ళ కాలంలో పునీత పౌలు రోమను సామ్రాజ్యంలో అన్యజనుల మధ్య వేదప్రబోధం చేస్తూ అనేక క్రైస్తవ సంఘాలను స్థాపించాడు, ముఖ్యంగా ప్రధానమైన రోమను నగరాలన్నింటిలోను పౌలు స్థాపించిన క్రైస్తవ సంఘాలుండేవి. వాటినుద్దేశించి రాసినదే ఈలేఖ.

ఒక యూదుడుగా పౌలు యూద జాతి యావత్తూ క్రీస్తు ప్రభువును తమ రక్షకుడుగా అంగీకరిస్తుందనుకున్నాడు. కానీ అలా జరుగలేదు. సాక్షాత్తూ దేవుడే చొరవు తీసికొని తనను తాను యూదులకు ఎరుకపరచుకున్నప్పటికీ, వారి పితరుల ద్వారా వారిని ప్రత్యేకంగా ఎన్నుకొని వారిని తన ప్రజలనుగా మలచుకొన్నప్పటికీ, వారికి తన ధర్మచట్టాన్ని ప్రసాదించి, యథార్థమైన ఆరాధనా విధానాలను బోధించి వారిని ఆధ్యాత్మికంగా సర్వసన్నద్ధులను చేసినప్పటికీ యూదులు క్రీస్తు ప్రభువును నిరాకరించారు. చివరికి యేసుక్రీస్తు తత్వమహత్వాలు వెల్లడయ్యాకనైనా ఆయనను నమ్మి అనుసరించవలసిన యూదులు ప్రభువును తిరస్కరించడం, చూచి పౌలు విచారగ్రస్తుడయ్యాడు. ఎంతగానో మధనపడ్డాడు. యూద జాతీయులు క్రీస్తు ప్రభువును విశ్వసించి క్రైస్తవులుగా మారడానికి తన ప్రాణాలనే ఫణంగా వొడ్డడానికి సిద్ధపడ్డాడు పౌలు. యూద జాతి రక్షణకోసం తన రక్షణభాగ్యాన్ని త్యాగం చేయడానికి కూడా సంసిద్ధుడయ్యాడు. తీవ్రమైన తన వేదనను ఉద్వేగాన్ని రోమను క్రైస్తవ సంఘంలోని యూద జాతీయులతో పంచుకుంటూ పౌలు ఇలా అంటున్నాడు. "నా రక్తసంబంధులైన నా ప్రజల కొరకై, నేను దేవునితో శపింపబడి, క్రీస్తునుండి వేరుచేయబడినచో బాగుండెడిది"

ఇలా పునీత పౌలు మాదిరిగా, ఏలీయా ప్రవక్త మాదిరిగా, మనలోని ప్రతి ఒక్కరము మన ఇరుగు పొరుగువారి మనోపరివర్తనను మనసారా కోరుకోవాలి. మన సాటి ప్రజలందరు రక్షణభాగ్యాన్ని పొందాలన్న దృఢ దీక్షతో మన వంతు కృషి మనం చేయాలి. ఈనాటి పఠనం బోధించే సందేశమిదే.

## సువార్త పఠనం: మత్తయి 14:22-33

యేసు నీటిమీద నడచిన వృత్తాంతంలో ప్రభువు ముందుగా తన శిష్యులను గలిలియ సముద్రం ఆవలి తీరానికి వెళ్ళమంటారు. అప్పటికే యేసు ప్రసాదించిన "అద్భుతాహారా"న్ని భుజించిన జనసమూహం వారిని వెంబడిస్తూ ఉంది. ప్రజల నుంచి తన శిష్యులను వేరుచేసి పడవ మీద ఆవలి తీరానికి పంపారు ప్రభువు. అందుకు కారణం లేకపోలేదు. అద్భుతాహారం భుజించిన ప్రజలు యేసును రాజుగా ప్రకటించాలని ఆతుర పడుతున్నారు. ఇది స్వార్థపూరితమైన ఆలోచన, దైవ సంకల్పానికి వ్యతిరేకమైన ఆలోచన. ఈ దురాలోచనల ప్రభావం తన మీదపడకూడదనే ఉద్దేశ్యంతోనే యేసు తన శిష్యులను లౌకిక మూకలకు దూరంగా పంపదలచుకున్నారు. వారినలా పడవలో పంపాక ప్రభువు పర్వత ప్రాంతంలోని ఏకాంత ప్రదేశానికి వెళ్ళారు. ఏకాంతమైన పర్వత ప్రాంతం ఆయనకు ఇష్టమైన ప్రార్థనా స్థలం (మత్తయి 5:1;4:8;17:1;28:6; 1రాజులు 19:11-13) అక్కడ ఆయన ఆ రాత్రంతా ప్రార్థనలోనే గడిపారు.

ప్రభువక్కడ ఎవరికోసం ప్రార్థించి ఉంటారు? బహుశా ఆయన ముందుగా తనను రాజును చేయదలచుకున్న ప్రజలకోసం ప్రార్థించి ఉంటారు. వారు తనను "రాజకీయ మెస్సయా" గా అపార్థం చేసుకోవడానికి బదులు తండ్రి దేవుని "బాధామయ సేవకుడు" గా గుర్తించునట్లు చేయుమని ప్రార్థించి ఉంటారు. అనంతరం తన శిష్యుల కోసం ప్రార్థించి ఉంటారు; వారు విశ్వసనీయమైన దైవజన సంఘంగా రూపుదిద్దుకోవాలని కోరుతూ అందుకు తండ్రి అనుగ్రహాన్ని అర్థించి ఉంటారు.

అలా ప్రభువు తండ్రి సాన్నిధ్యంలో నిలచి పారవశ్యంతో ప్రార్థన చేస్తున్నప్పటికీ శిష్యులపట్ల తనకున్న బాధ్యతను మరువలేదు. ఆనాడు యావే దేవుడు బంగారు దూడను ఆరాధిస్తూ పతనమవుతోన్న ప్రజలను రక్షింపడానికిగాను తన సమక్షంలో ఉన్న మోషేను తక్షణమే పంపినట్లు (నిర్గమ 32:7) ఇప్పుడు కల్లోలితమైన సముద్రంలో చిక్కుకున్న శిష్యులను కాపాడడానికి తన దివ్యశక్తిని ప్రదర్శిస్తూ నీటిపై నడచారు. సకాలంలో శిష్యుల వద్దకు చేరుకున్నారు.

ఇలా నీటిపై నడవగలగడం ప్రకృతి శక్తుల మీద ఆధిపత్యాన్ని ప్రకటిస్తూ చేసే అద్భుతం. ఇలాంటి అద్భుతాలను చేయగల శక్తిని సాధారణంగా దేవునికే ఆపాదిస్తారు. అదే దివ్యశక్తిని నేడు యేసుప్రభువు ప్రదర్శించారు.

అలాగే భయభ్రాంతులైన శిష్యులకు ధైర్యం చెబుతూ "నేనే" అంటారు ప్రభువు. ఇది తండ్రి దేవుని పవిత్రనామం; ఈ నామాన్ని తనకు అన్వయించుకుంటూ మాట్లాడిన ప్రభువు శిష్యులు సాక్షాత్తూ దేవుని సన్నిధిలో ఉన్నారు గనుక భయపడనవసరం లేదని పరోక్షంగా అభయమిస్తున్నారు. అవును. దేవుడు తన పవిత్రనామం చేతనే తన శ్రీసభను కాపాడగల సమర్థుడు. ఈ సత్యం కూడా మనకీ సందర్భంలో అంతర్లీనంగా సుబోధకమవుతుంది.

ఇకపోతే తన లాగే నీటిపై నడవడానికి పేతురుకు ఆజ్ఞనిచ్చారు ప్రభువు. అంటే తనకున్న దివ్యశక్తిని పేతురుతో పంచుకోవడానికి ప్రభువు సిద్ధంగా ఉన్నారన్న యదార్థం మనకిక్కడ స్పష్టమవుతుంది.

అలాగే యేసు ప్రభువుపై దృష్టిని నిలిపి నడచినంతసేపు పేతురు సైతం ఆయన దివ్యశక్తిని పొందుతూ నీటిపై నడువగలిగాడు. ప్రభువుపై నుంచి దృష్టి మరల్చగానే మునిగిపోసాగాడు. అంటే యేసు ప్రభువు పట్ల దృఢ విశ్వాసంతో, త్రికరణశుద్ధిగా ప్రభువుపైననే తమ దృష్టిని నిలిపి, ప్రభు ఆజ్ఞలకు బద్ధులై జీవిస్తున్నంతకాలం శిష్యులు ప్రభు దివ్యశక్తులను సైతం పంచుకోగలుగుతారు, దృష్టి మరలిన మరుక్షణం శక్తిహీనులవుతారు.

అంతేకాదు తండ్రి పవిత్రనామాన్ని తమకు అన్వయించుకుంటూ "నేనే" అని ప్రభువు పలికిన మాటలు ఆయన సాక్షాత్తూ దేవుని కుమారుడని విశ్వసించడానికి, నిగూఢమైన ప్రభు తత్వమహత్వాలను గ్రహించడానికి దోహదం చేస్తాయి.

చివరిగా ప్రభువు కలవరపాటుకు గురై మునిగిపోతోన్న పేతురును "అల్పవిశ్వాసీ" అని మందలిస్తారు. నిజానికి ఈనాటి ప్రభు శిష్యులందరు తాము "అల్పవిశ్వాసుల"మని అంగీకరిస్తూనే ఉంటారు. కానీ ఇలా అంగీకరించడంలో కనబరచిన చిత్తశుద్ధి, తమ అల్పవిశ్వాసాన్ని అనల్ప విశ్వాసంగా, దృఢవిశ్వాసంగా మలచుకోవడానికి కృషి చేయడంలో కూడా కనబరచాలి, జీవితాంతము అలా కృషిచేస్తూనే ఉండాలి. అప్పుడు ప్రభువిక వారిని "అల్పవిశ్వాసు" లంటూ మందలించవలసిన అవసరం రాదు, రాకూడదు.

## ముగింపు

చిమ్మచీకటిలో...నీటిపై కదలివచ్చే....తెల్లని ఆకారం...ఈ దృశ్యాన్ని చూచిన ఎవరికైనా భయం వేస్తుంది. అలాగే ప్రభు శిష్యులకూ భయమేసింది. ఆ భయంతోనే వారు కేకలు వేశారు. అప్పుడు ప్రభువు "నేనే" అన్నారు. ఆ మాటే వారికి అభయమయింది, కొండంత ధైర్యాన్నిచ్చింది, అపురూపమైన ఆనందాన్ని కలుగజేసింది. ప్రభు యేసు సన్నిధానంలో ఉన్న ప్రభు శిష్యులందరికీ ఇదే అనుభవం కలుగుతుంది, అద్భుతానుభూతి మిగులుతుంది.

అలాగే నీటిపై నడుస్తూ అణుమాత్రపు అవిశ్వాసంతో నీట మునగబోయిన పేతురు "ప్రభూ, కాపాడు" అని మొరపెట్టగానే, కదలివచ్చి కాపాడారు ప్రభువు. ఆపదవేళలో దేవునికి మొరపెట్టే హక్కు ఆయన సంతానంగా మనకు ఉంది. తనకు మొరలిడేవారినెవ్వరిని దేవుడు చేయి విడువరని చరిత్ర చెబుతుంది. మరి మనం? మనలో ఉన్న భయాలను బాధలను ప్రభువుకు విన్నవిస్తూ ఆయన శరణు వేడుతున్నామా? సహాయం కోరుతున్నామా?

# సామాన్య 20 వ ఆదివారం
# 20-08-2017

**యెషయా 56:1,6-7 రోమీ 11:13-15,29-32 మత్తయి 15:21-28**

ఈనాటి మూడు పఠనాలు క్రైస్తవేతరుల ముక్తిభాగ్యం మాటేమిటని ప్రశ్నిస్తున్నాయి? అన్యమతాల వారికి "రక్షణ" లభిస్తుందా? అని అడుగుతున్నాయి. అలాంటి అన్యులతో మనకు ఎలాంటి సంబంధ బాంధవ్యాలుండాలో చర్చిస్తున్నాయి.

క్రైస్తవులు, క్రైస్తవేతరులను సహృదయంతో ప్రేమించాలి, శాయశక్తుల వారికి తమ సేవా సహకారాలను అందజేస్తూ ఉండాలి; మనం చేసే మంచి పనులను చూచి ఇతరులు క్రైస్తవ విలువలను, క్రైస్తవ విశ్వాసాన్నీ, చివరికి క్రీస్తు ప్రభువును తెలుసుకోవడానికి తోడ్పడాలి; అలా "నేనే సత్యం" అని చెప్పిన క్రీస్తుప్రభువు ద్వారా వారు సత్యమార్గాన్ని అనుసరించగలుగుతారు (1తిమోతి 2:4).

ఈ విధంగా మనం క్రైస్తవేతరులను ప్రేమిస్తూ, వారి కొరకు ప్రార్థించడం వలన అపారమైన దేవుని కారుణ్యం వలన వారు కూడా "నిత్యజీవాన్ని" కోరుకోగలుగుతారు, రక్షణభాగ్యాన్ని పొందగలుగుతారు.

ఇలా "నిత్యజీవం" విలువ తెలుసుకొని, దివ్యవిందులో పాల్గొంటున్న ప్రతి ఒక్కరూ అన్యజనుల కోసం ప్రార్థన చేయాలని, అందరూ జీవాహారాన్ని భుజించే అవకాశం కల్పించాలని "దివ్యసత్ప్రసాదం" ఆహ్వానిస్తోంది!

## మొదటిపఠనం : యెషయ 56:1,6-7

ఇస్రాయేలీయులు బాబిలోనియా ప్రవాసం నుంచి (క్రీ.పూ 587-537) యెరుషలేముకు తిరిగి వచ్చేనాటికే వారికి బాబిలోను సంస్కృతి, బాబిలోను భాష, బాబిలోను సంప్రదాయాలు బాగా వొంటబట్టాయి. దానికి తోడు బాబిలోను చక్రవర్తి ఆదేశాల మేరకు అన్యజాతుల వారనేకులు యెరుషలేముకు తరలివచ్చి స్థిరపడ్డారు. దానితో ఇంతకాలమూ యూద జాతీయులకు మాత్రమే పట్టుగొమ్మవంటి యెరుషలేము నగరం ఇప్పుడు అన్య జాతీయులకు ఆటపట్టుగా మారింది. దీనితో ఇస్రాయేలీయులకు సరిక్రొత్త సవాళ్ళు ఎదురయ్యాయి. అన్యజాతులను తమలో కలుపుకోవడమా? లేక వారితో సహజీవననం చేయడమా? దేనికీ వారివద్ద సరైన సమాధానాలు లేకుండాపోయాయి. ముఖ్యంగా యెరుషలేము దేవాలయాన్ని పునర్నిర్మించే సమయంలో ఈ సమస్య వారిని ధర్మసంకటంలోకి నెట్టివేసింది. సున్నతి పొందలేకపోతే అన్యజనులు దేవాలయ పునర్నిర్మాణంలో గానీ, యూద జాతీయ జీవనంలోగాని పాల్గొనరాదని యెహెజ్కేలు ప్రవక్త అప్పటికే హెచ్చరికలు జారీ చేశాడు.

ఈ నేపథ్యంలోనే దేవుడు మరొక ప్రవక్తను పంపారు. ఇతణ్ణి "ప్రవాసానంతర ప్రవక్త" అని చెప్పుకోవచ్చు. ఇతడు కూడా యెషయా ప్రవక్త శిష్యుడే. యెషయా

గ్రంథంలోని 56వ అధ్యాయం నుంచి 66వ అధ్యాయం మధ్యభాగంలో ఈ నూతన ప్రవక్త చేసిన ప్రబోధాలు కనిపిస్తాయి. పరదేశీయుల పట్ల ఇస్రాయేలీయులు నూతన వైఖరిని అవలంభించాలని, ఉదారంగా వ్యవహరించాలని ఈ నూతన ప్రవక్త బోధించనారంభించాడు రానున్న కాలంలో దైవకుమారుడు బోధించబోయే "దేవుని సువార్తాసందేశాన్ని" ముందుగానే దర్శిస్తూ ప్రవక్త పలికిన మాటలివి.

ఈ పఠనంలోని అంతర్థాలను మనం జాగ్రత్తగా అవగాహనం చేసుకోవాలి.

ముందుగా: "నీతి న్యాయములు" అనే మాటలను గమనిద్దాం (56:1) ఈ మాటలను మొదట దేవుని పవిత్రతను, ఇస్రాయేలీయులను బాబిలోను ప్రవసాం నుంచి విడుదల చేయడంలో దేవుడు కనబరచిన విశ్వసనీయతను వ్యక్తం చేయడానికి ఉపయోగించేవారు. కానీ, ఇప్పుడు ఆ మేలి గుణాలను దైవప్రజలు కూడా అలవరుచుకోవాలని, వారు నీతి న్యాయాలను పాటిస్తూ పవిత్రజీవనం గడపాలనీ బోధిస్తున్నాయి.

అంతేకాదు అన్యజాతీయులను ఇస్రాయేలీ సంఘంలో చేర్చుకొనేటపుడు కొన్ని నియమాలను తప్పక పాటించాలని కూడా ప్రవక్త చెబుతున్నాడు. మొదట వారు ప్రభువైన దేవుని హృదయపూర్వకంగా ప్రేమించాలి. దేవుడు ఇస్రాయేలీయులతో చేసుకున్న ఒడంబడికలో భాగంగా ఆయనను సేవించాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇస్రాయేలీయులు శారీరకమైన సున్నతిని పాటించినట్లు, అన్యజాతీయులు హృదయగతమైన సున్నతిని పాటించాలి. అంటే ప్రభువైన దేవునికి వ్యతిరేకమైన వాటినన్నిటిని వారు తమ హృదయాల నుంచి శాశ్వతంగా తొలగించుకోవాలి.

అలాగే దైవసంకల్పం ప్రకారం దైవ ప్రజాసంఘంలో చేరుతొన్న అన్యజనులను చూచి ఇస్రాయేలీయులు, అదంతా తమ ఘనతేనని మిసిడిపడరాదు. విజయగర్వంతో పొంగిపోరాదు. అన్యజనులను సౌహార్దంతో స్వీకరిస్తూ వారి మధ్య తమ ధార్మిక కార్యక్రమాలను సవినయంగా కొనసాగిస్తూ ఉండాలి. అదే సమయంలో ప్రభువైన దేవుని ఉపదేశాలకు ఆదేశాలకు అనుగుణమైన వేదాంత సత్యాలు, పుణ్యజీవన విలువలు అన్యజాతులలో గానీ అన్యమతాలలో ఉన్నట్లయితే వాటిని సగౌరవంగా స్వీకరించాలి. విభిన్న సాంస్కృతిక సత్యాల మేలుకలయికను ప్రోత్సహించాలి. ఆదరించాలి. ఎందుకంటే లోకంలోని మానవులందరు రక్షణ పొందాలన్నదే దేవుని పావన సంకల్పం.

అవును తన సత్య సందేశాలను ఆలకించి, త్రికరణ శుద్ధిగా తనను విశ్వసిస్తూ, తన ఆజ్ఞలను నిష్టగా పాటించే మానవులందరికి తన రక్షణభాగ్యాన్ని ప్రసాదించడం భగవదభీష్టం (తండ్రి దేవుని సదాశయం).

## రెండవ పఠనం: రోమీ 11:13-15,29-32

"క్రీస్తు ప్రభువును తిరస్కరించిన యూదజాతి ఇక మానవ రక్షణచరిత్రలో నిర్వహించే పాత్ర ఎలాంటిది?" అనే ప్రశ్నకు జవాబు చెప్పుకునే క్రమంలో పునీత పౌలు మూడు అంశాలు గురించి లోతుగా ఆలోచిస్తూ తన మనోభావాలను వ్యక్తం చేస్తున్నారు.

**మొదటిది:** యూదులు క్రీస్తే మెస్సయా, ప్రభువని అంగీకరించడానికి నిరాకరిస్తూ ఆయనను పూర్తిగా తిరస్కరించడం వలననే అపోస్తలులు అన్యజనుల వద్దకు వెళ్ళి క్రీస్తు సువార్తను బోధించారు. అన్యజనులు ఆయన సువార్తను ఆలకించారు, క్రీస్తు ప్రభువే తమ రక్షకుడని ఆమోదించారు, రక్షణభాగ్యాన్ని పొందగలిగారు.

**రెండవది:** అయితే దేవుడు యూదులకు చేసిన వాగ్దానాలు, ఆయన వారికి ప్రసాదించిన వరాలు తప్పక నెరవేరి తీరుతాయి. అవి ఉపసంహారానికి అతీతమైనవి. గనుక కాలక్రమంలో యూదులలో అనేక మంది క్రీస్తు ప్రభువును విశ్వసిస్తారు. ఇలా అధిక సంఖ్యలో ప్రభు విశ్వాసులుగా మారిన ఇస్రాయేలీయుల వలన లోకానికి అధిక ప్రయోజనం చేకూరుతుంది; తొలిదశలో క్రీస్తును తిరస్కరించడం వలన కలిగిన నష్టం కంటే అధిక ఫలితాలిప్పుడు మానవజాతికి వొనగూరుతాయి. అవి జీవప్రదాయకమైన ఫలితాలవుతాయి.

**మూడవది:** దేవుడు కరుణాసాగరుడు, దయామయుడు. అపారమైన తన కారుణ్యం వలననే దేవుడు మానవులందరికీ రక్షణభాగ్యాన్ని ప్రసాదిస్తారు. మానవులందరు పాపాత్ములేనని ఎరిగిన ఆయన అందరి పాపాలను కరుణతో క్షమిస్తారు. అదే రీతిగా అదే కారుణ్యంతో, అదే దయాగుణంతో దేవుడు ఇస్రాయేలీయులకు కూడా రక్షణవరాన్ని ప్రసాదిస్తారు. గతంలో వారు యేసు ప్రభువును తిరస్కరించి చేసిన పాపాన్నీ, ఇప్పటికీ తిరస్కరిస్తూ చేస్తున్న పాపాపలను కూడా ఆయన క్షమించగలుగుతారు. ఎందుకంటే మానవులపట్ల ఆయనకు గల కరుణ అనంతమైనది. ఆయన చేసిన వాగ్దానాలు తిరుగులేనివి. గనుకనే పౌలు దేవుని అనంతమైన సౌజన్యానికిగాను ఆయనకు సదా ధన్యవాదాలు తెలుపమని చెబుతున్నాడు.

అలాగే "మానవులందరు కడకు తన కారుణ్యం వలననే రక్షణ పొందుతా"రని నిరూపించడానికే ఇస్రాయేలీయులలో కొందరిని అవిశ్వాసంలో బందీలను చేశారనీ, గనుక క్రీస్తును తిరస్కరించిన యూదులు సైతం చివరికి రక్షణ పొందగలుగుతారని పౌలు ప్రకటిస్తున్నాడు.

## సువార్త పఠనం: మత్తయి 15:21-28

ఈనాటి సువార్త పఠనంలో మనం "కననీయ స్త్రీ విశ్వాసం" గురించి చదువుతున్నాం. ఇదే వృత్తాంతం మనకు మార్కు సువార్త 7:24-30లో స్వల్పమైన మార్పులతో కనిపిస్తుంది.

మత్తయి 15:21-28 ప్రకారం "ప్రభూ! దావీదుకుమారా! నాపై దయచూపుము.." అంటూ కననీయ స్త్రీ దీనాతిదీనంగా చేసిన ప్రార్ధనను వినికూడా యేసుప్రభువు మిన్నకుండిపోతారు. అయినా ఆమె ఆయన వెన్నంటి వస్తూ దీనంగా మొరపెడుతూనే ఉంటుంది. అయినప్పటికీ ప్రభువు ఆమెకు ఉపకారం చేయడానికి రెండుమార్లు నిరాకరిస్తారు. రెండవ మారు ప్రభువు పలికిన మాటలు మరింత కఠోరంగా వినిపిస్తాయి. కననీయ స్త్రీని "కుక్క"తో సరిపోల్చడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తుంది.

యేసు సమకాలీన సమాజంలో విభిన్నజాతుల వారు ఇలాంటి పరుషపదజాలంతో పరస్పరం దూషించుకోవడం సర్వసాధారణంగా జరుగుతూనే ఉండేది. కానీ ఆలాంటి కర్ణకఠోరమైన మాటలు యేసునోట వెలువడడం, వాటిని వినవలసిరావడం ప్రభు శిష్యులకు సైతం ఇబ్బందికరంగానే ఉండి ఉంటుంది. అంతవరకు ఎందుకు? ప్రస్తుతం స్త్రీ స్వేచ్ఛ గురించీ, స్త్రీ పురుష సమానత్వం గురించీ ప్రబోధిస్తూ సామాజిక పరివర్తన కోసం పనిచేస్తోన్న మనం ఈ మాటలను ఎలా అర్ధం చేసుకోవాలి? ఎలా సమాధానం చెప్పుకోవాలి? అయితే, యేసు ప్రభు తిరస్కారంతోనే ఈ వృత్తాంతం ముగిసిపోలేదు. ముందు తిరస్కరించినట్టు కనిపించిన ప్రభువే చివరికి "నీ విశ్వాసము మెచ్చదగినది" అంటూ మెచ్చుకుంటారు. ఆమె ప్రార్థన ఆలకించారు, ఆమె కుమార్తెను స్వస్థపరచారు.

దీనినిబట్టి మనకు అర్థమయ్యేది ఏమిటంటే ఈ వృత్తాంతంలో మొదట జరిగిన నాటకీయ పరిణామాలు, సంభాషణలన్నీ ఆ కననీయ స్త్రీ విశ్వాసంలోని గొప్పతనాన్ని చాటి చెప్పడానికి ఉద్దేశించినవేగానీ ఆమె స్త్రీత్వాన్ని గానీ ఆమె జాతీయతను గానీ కించపరచడానికి ఉద్దేశించినవి కావు.

అవును. అన్యజాతీయురాలైన ఆ కననీయ స్త్రీ విశ్వాసమహత్వాన్ని చాటిచెప్పే ఉద్దేశ్యంతోనే, ఆమె విశ్వాసాన్ని అందరికీ ఆదర్శంగా చూపే తలంపుతోనే సువార్తకారుడు మత్తయి ఈ వృత్తాంతాన్ని ఉద్వేగభరింతంగా నడిపించాడు. చివరికి తాను అందించదలచుకున్న సందేశాన్ని శక్తిమంతంగా అందజేయగలిగాడు.

అన్యజాతీయురాలైనప్పటికి కననీయ స్త్రీకి యూదమత పుట్టుపూర్వోత్తరాలన్నీ తెలుసునని ఆమె మాటలనుబట్టి తెలుసుకోవచ్చును. కేవలం పుట్టు పూర్వోత్తరాలు తెలియడమే కాదు యూదమత విశ్వాస సత్యాలన్నిటినీ ఆమె గాఢంగా విశ్వసిస్తున్నట్టు ఆమె తన ప్రార్థన ద్వారా, యేసుప్రభువుతో జరిపిన సంభాషణ ద్వారా స్పష్టంగా నిరూపిస్తుంది.

అలాంటి అచంచలమైన విశ్వాసంతోనే ఆమె యేసుప్రభువును "దావీదు కుమారా!" అని ఎలుగెత్తి పిలుస్తుంది, "నాపై దయ చూపుము" అంటూ మొరపెడుతుంది. దీనిని బట్టి ఆమె తనకు వ్యక్తిగతంగా యేసుప్రభువుపై ఉన్న నమ్మకంతోనే ఆయన సహాయాన్ని అర్థించడానికి వచ్చిందని రుజువవుతుంది.

నిజానికి కననీయ స్త్రీకి ఇస్రాయేలీయుల దేవుడెవరో తెలుసు. ఆ దేవుడు ఎన్నుకున్న ప్రజలే ఇస్రాయేలీయులనీ తెలుసు. దేవుడు వారికొొక వాగ్దానం చేశారని, ఆ వాగ్దానం ప్రకారం దావీదు వంశంలో జన్మించబోయే రక్షకుడి కోసం ఇస్రాయేలీయులు ఎదురుచూస్తున్నారని తెలుసు. చివరికి రానున్న మెస్సయా ప్రభువు రానేవచ్చారనీ, ఆయన నజరేతు యేసుప్రభువని కూడా కననీయ స్త్రీకి తెలుసు. కేవలం తెలియడమే కాదు, అది ఆమె నమ్మకం దృఢవిశ్వాసం!

ఆలాంటి విశ్వాసంతోనే ఆమె యేసును "దావీదు కుమారా!" అని సంబోధిస్తూ "దయచూపు" మని ప్రార్థిస్తుంది.

అన్నిటిని మించి మత్తయి సువార్తలో మాత్రమే మనకు కనిపించే మరో విశేషమేమిటంటే "దేవుడు తన రక్షణభాగ్యాన్ని యూదజాతి ద్వారా ప్రసాదిస్తున్నప్పటికీ, ఆ రక్షణభాగ్యం లోకంలోని మానవులందరికీ చెందుతుందని, యూదులతోపాటు సకల మానవులు రక్షణ పొందడానికి యోగ్యులవుతా" రనే నిగూఢమైన విశ్వాస సత్యం కననీయ స్త్రీ మాటల ద్వారా వెల్లడవుతుంది.

"తమ యజమానుని భోజనపు బల్లనుండి క్రిందపడిన రొట్టెముక్కలను కుక్కపిల్లలును తినునుగదా!"

అంటే పరమ నిష్ఠాగరిష్ఠులైన యూతమత పెద్దలకు లేని విజ్ఞతను, విశ్వాసాన్ని ఇక్కడ కననీయస్త్రీ వ్యక్తపరుస్తోంది. యేసుప్రభువు కననీయ స్త్రీతో పరుషంగా పలికిన మాటలు ఆమె తన విశ్వాసాన్ని మరింత బలంగా వెల్లడించడానికి అవకాశం కల్పించాయి. "జాతియత" ద్వారా యూదులు "దేవుడు ఎన్నుకొనిన ప్రజ"లైతే, "విశ్వాసం" ద్వారా తాను దైవప్రజలలో ఒకర్తెనయ్యాయనని నిరూపిస్తుంది.

ఈ వృత్తాంతం ద్వారా మత్తయి స్పష్టం చేయదలచుకున్న సత్యంకూడా ఇదే "యూద జాతిలో పుట్టిపెరిగినవారు మాత్రమే యూదులు కారు. క్రీస్తు ప్రభువు పట్ల దృఢమైన విశ్వాసం కలిగిఉన్నవారే యథార్థమైన యూదులు. అబ్రహాము సంతతివారు కారు యూదులు, దృఢవిశ్వాసం గల క్రైస్తవులు యూదులు."

ఇది కననీయ స్త్రీ వృత్తాంతం నుంచి మత్తయి గ్రహించిన సత్యసారాంశం. తాను గ్రహించిన ఈ సత్యాన్ని సాధ్యమైనంత బలంగా వెల్లడించడానికే కథనాన్ని నాటకీయంగా నడిపించాడు. కననీయ స్త్రీ విశ్వాసాన్ని ఆదర్శప్రాయంగా చిత్రీకరించాడు!

## ముగింపు

"విశ్వాసం ఆశాభావం" అనేవి ఒకే నాణానికి బొమ్మాబొరుసుల్లాంటివి. విశ్వాసంతో ప్రార్థన చేస్తాం. ప్రార్థన ఫలిస్తుందనే ఆశాభావంతో ప్రార్థన చేస్తాం. అలా ఆశించిన ఫలితం సిద్ధించే వరకు ప్రార్థిస్తూనే ఉంటాం...ప్రార్థిస్తూనే ఉండాలి!

"కననీయ స్త్రీ" లో మనకీ రెండు సుగుణాలు కనిపిస్తాయి. గనుకనే చివరికి ప్రభువును మెప్పించి తాను కోరుకున్న స్వస్థతా వరాన్ని పొందగలిగింది.

అయితే యేసుప్రభువు కననీయ స్త్రీ విశ్వాసాన్ని పరీక్షించినట్లు, దేవుడు మన విశ్వాసాన్ని కూడా పరీక్షిస్తూ ఉంటారు. మన విశ్వాసం ఏ మేరకు బలమైనదో, ప్రార్థించడంలో మనకుగల ఆశాభావమేపాటిదో పట్టి చూస్తారు. మన విశ్వాసం గట్టిదేనని రుజువైతే కననీయ స్త్రీ మాదిరి మనం కూడా దేవుని మెప్పును పొందగలుగుతాం, కోరిన వరాన్నీ అందుకోగలుగుతాం!

# సామాన్య 21వ ఆదివారం

## 27-08- 2017

***యెషయా 22:15,19-23   రోమీ 11:33-36   మత్తయి 16:13-20***

యేసుక్రీస్తు ఎవరో తెలిసినవారు తండ్రి దేవుడు ఒక్కరే. తండ్రి దేవుడే తన కుమారుని తత్వమహత్వాలను నిగూఢ సత్యాలన్నింటినీ వెల్లడించగలరు. అపోస్తలులు సైతం యేసుప్రభువు దైవకుమారుడన్న సత్యాన్ని తండ్రి దేవుని ద్వారానే తెలుసుకోగలిగారు. అలాగే తండ్రి దేవుని ద్వారా ఆయన దివ్యకుమారుని గురించి తెలుసుకొనే సౌలభ్యం క్రీస్తు శిష్యులందరికి ఉంది. అది శ్రీసభ ద్వారానే సాధ్యమవుతుంది. ఆనాడు అపోస్తలులు, ఈనాడు మనమూ దైవజన సంఘం ద్వారానే దైవకుమారుడైన క్రీస్తుప్రభువును తెలుసుకోగలుగుతాం, ఆయన సాన్నిధ్యభాగ్యాన్ని చవిచూడగలుగుతాం. భక్తి శ్రద్ధలతో ఆయనను పూజించగలుగుతాం.

## మొదటి పఠనం: యెషయా 22:15,19-23

యూదయా సీమకు చెందిన యెరూషలేము నగర రాజ్యాన్ని హిజ్కియా రాజు పరిపాలిస్తోన్న కాలమది. హెబ్నా అనేవాడు హిజ్కియా కొలువులో ప్రధాన మంత్రిగా సేవలందించేవాడు అంతేకాదు రాజుకు ఆంతరంగిక సలహాదారు కూడా అతడే. అస్సీరియా సేనల దాడినుంచి యెరూషలేమును కాపాడుకోడానికి గాను ఈజిప్టు రాజు సహాయాన్ని తీసుకొమ్మని సలహాఇచ్చినవాడు ఇతడే. అప్పటికే అస్సీరియా రాజు ఉత్తరానగల ఇస్రాయేలును జయించి వాగ్దాత్తభూమిలో సగభాగాన్ని తన ఆధీనంలోని తెచ్చుకున్నాడు. గనుక అస్సీరియా రాజు తన సేనలను యెరూషలేము వైపు నడిపించేలోపు ఈజిప్టు రాజు మద్దతు కోరుమని హెబ్నా,హిజ్కియా రాజుకు నూరిపోస్తూ ఉండేవాడు.

వీరి రాజతంత్రాన్ని ప్రవక్త తీవ్రంగా ఖండించేవాడు. పరరాజుల సాయం కోసం అర్రులు చాచే బదులు దేశబద్రత కోసం ప్రజా సంక్షేమం కోసం యావే దేవుని ఆశ్రయించుమని చెప్పాడు. దేవునితో సఖ్యపడి ఆయనతో తమకు గల అనుబంధాన్ని పునరుద్ధరించుకోగలిగితే అదే దేశానికి రక్షగా నిలుస్తుందని బోధించాడు. దేవునిపట్ల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రజలు యెరూషలేమును అప్పటికే అన్య దేవరల ఆరాధన మందిరంగా మార్చడాన్ని దుయ్యబడుతూ యెషయా ప్రవక్త తక్షణమే మనోపరివర్తనం చెంది, సత్యదేవుని సన్నిధికి మరలి రమ్మని ఘోషించసాగాడు. అలా యెషయా చేసిన ప్రయత్నాలలో ఏ ఒక్కటీ ఫలించలేదు. అటు రాజు గానీ ఇటు ప్రజలుగానీ ప్రవక్త మాటలను లెక్కచేయలేదు. "వినశకాలే విపరీత బుద్ధిః" అన్నట్టు నాశనకరమైన మార్గంలోనే నడకలు సాగించారు.

ఈ నేపథ్యంలో యెషయా పలికిన ప్రవచనాలనే ఈనాటి మొదటి పఠనంలో చదువుతున్నాం. హిజ్కియా రాజుకు దుర్బోధలు చేస్తూ దేశాన్నీ, దేశప్రజలను తప్పుదారి

పట్టిస్తోన్న హెబ్నా చేత్తుల్లోంచి "రాజ్యాధికారపు తాళపుచెవులు" తొలగించి, వాటిని యెల్యాకీముకు అప్పగించాలన్నది దేవుని సంకల్పం. ఇదే సందేశాన్ని యెషయా ప్రవక్త ఈనాటి ప్రవచనాల్లో ప్రకటిస్తున్నాడు. ఒక వ్యక్తిని ఉద్దేశించి యెషయా పలికిన ప్రవచనం ఇదొక్కటే కావడం విశేషం.

ఎట్టకేలకు యెషయా ప్రవచనాల ఫలితంగా హిజ్కియా రాజు దైవసంకల్పానికి విధేయుడైనప్పటికీ, ప్రజలలో పరివర్తనం తేవడంలోను, వారిని దైవ విధేయ మార్గంలో నడపడంలోను విఫలమయ్యాడు. ఫలింతంగానే అస్సీరియనులు క్రీస్తుపూర్వం 701లో యెరూషలేమును జయించారు. అయితే యెషయా ప్రవచించినట్లు యెరూషలేమును నాశనం చేయడానికి దేవుడు అనుమతించలేదు. గనుక అస్సీరియన్లు నగర విధ్వంసానికి పూనుకోలేదు.

ఈనాటి పఠనం ప్రధానంగా నగరాధికారులైన హెబ్నాకూ యెల్యాకీముకూ మధ్యగల వ్యత్యాసాన్ని వివరిస్తుంది. హెబ్నా మాదిరి కాకుండా యెల్యాకీము "దావీదు రాజగృహపు" తాళపు చెవులను దైవసంకల్పానుసారం పదిలంగా కాపాడతాడనీ, తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తాడని తెలియజేస్తుంది. తొలిక్రైస్తవ సంఘాల వారు పూర్వ నిబంధన గ్రంథంలోని ఈ 'యెల్యాకీము తాళపు చెవులు" ప్రవచనాన్ని నూతన నిబంధనలో యేసుప్రభువు పేతురుకు తన రాజ్యపు తాళపు చెవులనిచ్చిన సంఘటనతో సరిపోల్చుతూ ఉండేవారు; యేసు ప్రభువు పేతురుకు తాళాలనప్పగించడంతో ఆనాటి యెషయా ప్రవచనం నెరవేరిందని భావించేవారు. ఈ ఘట్టాన్నే మనమీనాటి సువార్త పఠనంలో పఠించి ధ్యానించబోతున్నాం.

## రెండవ పఠనం: రోమీ 11:33-36

యేసుక్రీస్తు ప్రభువు ద్వారా మానవజాతిని పాప విముక్తుల్ని చేసి తనతో సఖ్యపరచుకోవాలన్నది దేవుని ప్రణాళిక. దేవుడు నిర్దేశించిన ఈ రక్షణప్రణాళికలో యూద జాతీయులకు గల స్థానమేమిటో పునీత పౌలు రోమీయులకు రాసిన లేఖలో వివరించే ప్రయత్నం చేస్తున్నాడు. యూదజాతి క్రీస్తును ప్రభువుగా ఆమోదించి స్వీకరించక పోవడం పట్ల పునీత పౌలు తీవ్రమైన ఆందోళనను, విచారాన్నీ వ్యక్తం చేస్తున్నాడు. దేవుడు ప్రత్యేకంగా యూదాజాతిని ఎన్నుకొని తరాలతరబడి సిద్ధం చేసినప్పటికీ వారాయనను తిరస్కరించడాన్ని చూచి పౌలు ఎంతగానో మధనపడ్డాడు. ఈ తిరస్కారానికి కారణమేమిటో తెలుసుకోవడానికి పౌలు ఎంతోకాలం ప్రయత్నించాడు, కానీ అర్థం చేసుకోలేకపోయాడు.

చివరికి అవిధేయులైన యూదులు సైతం దేవుని అనంతమైన కృప వల్లనైనా రక్షణభాగ్యాన్ని పొందగలిగితే బాగుండుననుకున్నాడు పౌలు. అలా తాను ఆశాభావంతో అనుకున్నదే దేవుడు అమలుచేయబోయే రక్షణప్రణాళిక అని గ్రహించిన పౌలు ఎంతగానో సంతసించాడు. అవును. దేవుడు తన కృపానుసారమే మానవులందరినీ రక్షించబోతున్నారు.

ఈ యథార్థాన్ని గ్రహించాక పౌలు మనస్సు శాంతిచింది. యూదులు తిరస్కారానికి సంబంధించిన ప్రశ్నలకు జవాబులు వెదకే పనిని పౌలు ఉపసంహరించుకున్నాడు. అనంత కృపామయుడైన దేవుడు జాతివిభేదాల కతీతంగా మానవులందరికి, ముక్తిభాగ్యాన్ని

ప్రసాదించబోతున్నారన్న అద్భుతభావన పౌలు హృదయాన్ని పులకింపజేసింది. దేవుని ఆలోచనలు ప్రణాళికలు ఆయన అనుసరించే మార్గాలు ఎంత మార్మికమైనవో ఎంతటి మహత్తరమైనవో యోచిస్తూ పౌలు భక్తి పారవశ్యంతో రాసిన వచనాలనే మనమీనాటి పఠనంలో చదువుతున్నాం.

మన కెదురయ్యే ప్రశ్నలకు ప్రయాసపడి మనం కనుగొనగలిగే జవాబులకంటే ఉత్తమమైన జవాబులు సర్వోత్తమమైన పరిష్కారాలు దేవుని వద్దనే ఉంటాయి. గనుకనే పౌలు "ఆయన నిర్ణయములను ఎవడు శోధింప గలుగును!" అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నాడు, నిగూఢమైన, అమోఘమైన దేవుని మహత్యాన్ని నోరార స్తుతిస్తున్నాడు.

## సువార్తపఠనం: మత్తయి 16:13-20

ఆనాటి పాలస్తీనా సమాజంలో ఒక వ్యక్తిని పేరుపెట్టి పిలవడము అంటే ఆ వ్యక్తితో మనకు ఎంతోకాలంగా పరిచయమున్నదని, అతడి గురించి మనకు పూర్తిగా తెలుసునని అర్థం. మరో మాటలో చెప్పాలంటే ఆనాటి ఆచారం ప్రకారం బాగా తెలిసిన వారిని మాత్రమే పేరుపెట్టి పిలిచేవారు.

ఈనాటి సువార్త యేసుప్రభువు తనను గురించి లోకులు అనుకుంటున్న మాటలను పెద్దగా పట్టించుకోలేదు, కానీ తన శిష్యులు తన గురించి ఏమనుకుంటున్నారో, వారు తనను ఎంతవరకు తెలుసుకోగలిగారో, ఎంతలోతుగా అర్థం చేసుకోగలిగారో స్పష్టంగా తెలుసుకోదలచాడు.

ఈ సందర్భంలోనే పేతురు యేసు ప్రభువును రెండు బిరుదనామాలతో సంబోధిస్తున్నాడు. "క్రీస్తు", "సజీవుడగు దేవుని కుమారుడు". ఇలా పిలువడం ద్వారా పేతురు యేసు ప్రభువు పట్ల తనకున్న అవగాహనను ఆంతరంగిక జ్ఞానాన్నీ ఆయనతో తనకుగల అనుబంధాన్ని వ్యక్తం చేయగలిగాడు.

యూదుల సంప్రదాయం ప్రకారం ఇలాంటి బిరుదనామాలు గల మెస్సయాకు ఉదాత్తమైన ఇతరగుణాలు కూడా అనేకం ఉంటాయి. అతడొక "రాజు", "దీనజన రక్షకుడు", "దేవునితో విలక్షణమైన అనుబంధం గలవాడు".

కానీ ఇక్కడ పేతురు పలికిన రెండు పేర్లు, అవి సూచించిన రెండు గుణాలు ప్రత్యేకంగా యేసు ప్రభువుకే చెందుతాయి. ఆంగ్లానువాదంలో చేర్చిన "THE" అనే ప్రత్యయం ఈ భావాన్నే సూచిస్తుంది. ఇలా క్రీస్తు పునరుత్థానానికి ముందే ఈ విశ్వాస ప్రకటనం చేయడం ద్వారా పేతురు పూర్వనిబంధన సంప్రదాయంలో రక్షకునికి చెందిన "క్రీస్తు" "దైవకుమారుడు" అనే రెండు బిరుదనామాలను యేసు ప్రభువుకే అన్వయించాడు. తండ్రి దేవుని ప్రేరణ ప్రకారమే పేతురు ఈ ప్రకటన చేయగలిగాడు.

పేతురు పలికిన మాటలను విన్న యేసు ప్రభువు అవి పేతురు స్వీయ పరిజ్ఞానంతోనో, తన గురించి చేసిన అధ్యయన ఫలితంగానో పలికిన మాటలు కావనీ, సాక్షాత్తూ తన

తండ్రి వెల్లడించిన సత్యాలను గ్రహించడం వల్లనే పేతురు ఆ ప్రకటన చేయగలిగాడని తెలుసుకోగలిగారు. బదులుగా యేసు సీమోనును అభినందిస్తూ "పేతురు" అంటూ సంబోధించాడు. యేసు సమకాలీన ప్రపంచంలో "పేతురు" అనే పేరుగల వారు మరొకరెవరూ కనిపించరు. "రాయి" దృఢత్వానికి సంకేతం దుష్టశక్తి సైతాను దాడులకు చెక్కుచెదరని దృఢమైన వ్యక్తిత్వాన్ని ఇది సూచిస్తుంది. అంతే కాదు తన స్వీయశక్తితో సైతానును ఎదుర్కొని జయించి దాని బంధనాలలో చిక్కిన వారిని పేతురు విమోచించగలడన్న అర్థాన్ని కూడా ఇది స్ఫురింపజేస్తుంది.

అలాగే "పేతురు "అనే పేరు" ప్రామాణికత' కు "సాధికారత" కు మారు పేరుగా నిలుస్తుంది. ఈ పేరుగల వ్యక్తి దైవజన సంఘాన్ని ప్రామాణికంగా సాధికారతతో నడిపించగలడన్న సందేశము ఇందులో మనకు అంతర్లీనంగా ధ్వనిస్తుంది.

ఈనాటి పఠనం మనకు మరొక సత్యాన్ని కూడా బోధిస్తుంది. అదేమిటంటే క్రైస్తవ విశ్వాసం అనేది ఎవరికి వారు వ్యక్తిగతంగా అన్వేషించి కనుగొనగలిగేదికాదు. అది తమ ఆత్మాంతరంగంలో తండ్రి దేవుడు తన కుమారుని గురించి వెల్లడించే నిగూఢ సత్యాలను ఆలకించి నిండు మనస్సుతో ఆమోదించడం మీదనే ఆధారపడి ఉంటుంది.

అలాగే యథార్థమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలన్నా, మనకున్న విశ్వాసాన్ని కాపాడుకోవాలన్నా మనం "దైవజనసంఘం" శ్రీసభలో సభ్యులుగా కొనసాగుతూ ఉండాలి. "ప్రామాణికమైన" నాయకత్వంలో నడువగలగాలి. ఇది ఎంత అవసరమో కూడా ఈనాటి సువార్త పఠనం మనకు పరోక్షంగా బోధిస్తుంది.

**ముగింపు:**

"నా గురించి మీరేమనుకుంటున్నారు?" లేదా "నా గురించి అభిప్రాయమేమిటి?" అని ఎవరైనా అడిగితే ఆ వ్యక్తి మనతో సంబంధం కలుపుకోవడానికి చూస్తున్నారని అర్థం చేసుకోవచ్చును. "నేను ఎవరని మీరు భావించుచున్నారు?" అంటూ ప్రభువు తన శిష్యులను అడిగిన ప్రశ్నలో అంతర్లీనంగా ఉన్న భావం కూడా ఇదే. మూడేళ్ళుగా తనతో కలిసి ఉంటున్న శిష్యులకు, తనకూ మధ్యగల అవగాహన ఏ స్థాయిలో ఉన్నదో ప్రభువు తెలుసుకోదలచారు. "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు ఇచ్చిన జవాబు విని తృప్తి చెందారు.

నిజానికి ప్రభువుతో శిష్యులకు ఉన్న సంబంధం కంటే దివ్యసంస్కారాల ద్వారా మనకు ప్రభవుతో ఉన్న అనుబంధం సుదీర్ఘమైంది. మరి ఆనాడు శిష్యులను అడిగినట్లే ప్రభువు ఇప్పుడు "నేను ఎవరని మీరు భావించుచున్నారు?" అని మనల్ని అడిగితే మనమిచ్చే జవాబేమిటి?.. ప్రభువును మనం ఏ మేరకు అర్థం చేసుకోగలిగాం! ఆయనకూ మనకూ మధ్యగల అనుబంధాన్ని ఏవిధంగా వర్ణించి చెప్పగలం!

# మోక్షారోపిత పునీత మరియ (ఆగష్టు 15)

మరియతల్లి ఈ లోకంను ఎప్పుడు వీడిందో చరిత్ర ప్రకారం ఖచ్చితంగా తెలీదు. కాని జెరుసలేంనుండి ఈ తల్లి వెళ్ళిందని తెలుస్తుంది. మరో కథనం చొప్పున ఆమె యోహాను సంరక్షణలో ఎఫెసు నగరంలో ఉండి క్రీస్తు మోక్షారోహణం తర్వాత 3 నుండి 15 సం॥ల మధ్య, ఈ లోకం విడిచి మోక్షంకు ఎత్తబడిందని ఎరుకవుతోంది.

కతోలిక ప్రాచీన సాంప్రదాయ కథనాన్ని బట్టి మరియమాత ఆత్మ, శరీరాలతో మోక్షారోపణం కావించబడ్డారని తెలుస్తుంది. అది ఏమిటంటే మరియతల్లి మరణానికి కొన్ని రోజుల ముందు అతిదూతయైన గాబ్రియేలు ఆమెవద్దకు వచ్చి "నీవు కొద్ది రోజుల్లో ఈ లోకాన్ని వీడి పరలోకంలో ఉన్న నీ కుమారుడైన క్రీస్తును కలుసుకుంటావు" అని ప్రకటిస్తాడు. ఆమె తన ప్రాణాలను విడిచేముందు అపోస్తులులు అందరు ఆమె చుట్టూ చేరినపుడు ఆమె వారివైపు చూసి వారిని ఆశీర్వదిస్తున్న సమయంలో వారు ఒక దర్శనాన్ని కాంచారు. క్రీస్తు ప్రభువు తన దేవదూతల సమూహంతో వచ్చి తన తల్లి, మనందరి తల్లియైన మరియమాతను తనతో మోక్షానికి తీసుకొని వెళ్ళడం చూశారట. తరువాత ఆమె శరీరాన్ని సమాధిలో భద్రపరచడం జరిగిందట. ఆమె మరణానికి ముందు ఆమెచుట్టూ సమావేశమైన అపోస్తలులతో లేనటువంటి శిష్యుడు (బహుశా తోమాసుగారు) సమాధి చేసిన మూడురోజుల తరువాత వచ్చినప్పుడు, ఆమెను ఉంచిన సమాధిని తెరచినపుడు పవిత్ర్యానికి నిలయమైన లిల్లీపుష్పాలు ఆమెను ఉంచిన స్థలంలో విరిశాయట. దీనిని చూసిన అపోస్తలులు మరియ ఆత్మ శరీరాలతో మోక్షానికి ఎత్తబడిందని విశ్వసించారట.

దేవమాతకు బొందితో మోక్షప్రాప్తి అనగా ఆత్మశరీరాలతో ఉత్తాపితయై స్వర్గంకు గొనిపోబడిందని ఐదవ శతాబ్దంనుండే క్రైస్తవ లోకం నమ్ముతోంది. క్రీ॥శ॥ 451లో పునీత జువెనల్ ఈ విషయాన్ని చెల్సడన్ క్రైస్తవ మహాసభలో ఎలుగెత్తి ప్రకటించారు. అయితే ఇది ఒక శ్రీసభ విశ్వాస సత్యంగా 1950 నవంబరు 1న 12వ భక్తినాథ పోపుగారు. అధికారపూర్వకంగా సిద్ధాంత పత్రం జారీచేశారు. ఆగష్టు 15న మోక్షారోపితమాత పండుగగా నిర్ణయింపబడింది. ఆ తేదీ భారతదేశంకు స్వాతంత్ర్యం వచ్చిన దినం కావడం యాధృచ్ఛికం. అందుకేనేమో మోక్షారోపితమాత మనదేశ పాలక పునీతగా ఏర్పరచబడింది. నిత్య స్వాతంత్ర్యమాతగా వందింపబడుతోంది. పిశాచి దాసత్య విమోచనోద్యమ పోరాటంలో ప్రముఖపాత్ర వహించి మానవులకు ఆదర్శమైంది. ఆమె నేర్పిన జపమాల ముఖ్య ఆయుధమైంది.

పునీత అల్ఫోన్సస్ లిగోరి తన "మేరీమాత మహిమలు" అనే గ్రంథంలో "పాపం చేసినందుకు శిక్ష మరణం. అయితే పాపమే సోకనట్టి మరియకు మినహాయింపు ఉంటుంది." అని వ్రాశారు. మరియ అన్ని విధాల యేసును పోలి ఉంది. ఒక దైవత్వం తప్ప. అందుకే ఆమెకూడ మరణించాల్సి ఉంది. ఇది దైవచిత్తం. కాని ఆమె మరణం ఎలాంటిది? మధురమైనది. మహాదానందకరమైనట్టిది. మూడు కారణాల్ని బట్టి మరణం భయంకరమైనది. అవి 1. లోకాశల వలలో చిక్కుకొని ఉండటం. 2. చేసిన పాపాలకు ప్రాయశ్చిత్త మనుభవించకపోవడం. 3. విముక్తి లేక మోక్షంపొందడం అనుమానాస్పదం కావడం.

ఈ మూడు కారణాలపట్ల మరియ విభిన్నంగా ఉంది. ఆమె ఈ లోక ఆశలవలయంలో తగుల్కొనక దేవునితో మాత్రమే సఖ్యత కలిగి ఉంది. పాపంకాదుకదా అసలు జన్మపాపమే లేనట్టి ఈ పవిత్రురాల్ని మరణం ఏంచేయలేదు. పాపంలేకుండా ప్రాయశ్చిత్తం సమస్యేలేదు. కాన మరణం ఆమెను భయపెట్టలేదు. బాధించలేదు. పైగా మరణం ఆమెకు మధురమైనది. స్వేచ్ఛ, సంతోషం నిచ్చేది. అందుకు ఉపయోగపడే ఒక ద్వారము మాత్రమే మరియు సంపూర్ణ దైవప్రేమతో దేవయిష్ట వరప్రసాదాలతో నిండి ఉంది. పాపంనుబట్టి, దుర్భలత్వంనుబట్టి కాక మరియ పుణ్యాల్నిబట్టి ప్రేమలనుబట్టి దేవుని చిత్తం చొప్పున మరణం ప్రాప్తించింది. ఆ మరణద్వారం ఆ పవిత్రురాల్ని తనకు తండ్రి, పుత్రుడు, ఆత్మదేవుని కడకు చేర్చింది. అందుకే ప్రేమ ఎంత మధురమో మరణం కూడ ఆమెపట్ల అంతే మధురం.

యేసు మోక్షం వెళ్ళాక మరియ ఈ లోకంలోనే ఉండింది. యేసు శిష్యులకు "పెద్దదిక్కు" గా మారింది. వారు ఆమె శరణంలోనే ఉండి ఓదార్పు. ధైర్యం ప్రోత్సాహం పొందుతూ, సందేహాలు, సమస్యలు తీర్చుకుంటూ ప్రార్థనతో బలపడ్డారు. పెంతెకోస్తు దినాన మరియతోపాటు యేసు శిష్యులందరిపై పవిత్రాత్మ దేవుడు దిగిరావడంతో ఈ శిష్యులు ఇక స్వయం ప్రకాశకులయ్యారు (అ.కా. 2:1-4) సకలజాతి జనులకు క్రీస్తు రక్షణ ఫలాలను అందింప వెళ్ళారు.

మరియమాత చనిపోకముందు బంధువురాలైన పునీత ఎలిశబేతమ్మతో "నా కుమారుడు తన దివ్యహస్తాల్లో సిలువను పట్టుకొని నాకు ప్రత్యక్షమయ్యాడు" అని చెప్పింది. ''ఆ సమయంలో యేసుప్రభువు ఆ తల్లికి స్వహస్తాలతో దివ్యసత్ప్రసాదమందించా" రని పునీత యోహాను అన్నారు.

పునీత అన్‌సెలమ్ ఇలా చెప్పారు. "రక్షకుడైన యేసు తన తల్లికంటే ముందుగా మోక్షానికి ఎందుకెళ్ళారో తెలుసా! ఆ తల్లికి తగిన సింహాసనం. మోక్ష కిరీటం

సిద్ధపరచడానికి. సమయం ఆసన్నమైనప్పుడు సకల మోక్షవాసులతో కూడి ఎదురేగి ఆ పవిత్రురాల్ని స్వర్గంలోకి సాదరంగా స్వాగతించడానికి. ఆమెను మోక్షరాజ్ఞిని చేసి సకల మోక్షవాసులతో గౌరవవందనం సమర్పింపచేయడానికే" అని.

అవును ఆ తల్లి ఈ పురస్కారానికి అన్ని విధాల అర్హురాలు. తొలి క్రైస్తవురాలు. తొలి శ్రీసభకు ముందుగా నడచిన క్రైస్తవ నాయకి. క్రీస్తును వెంబడించిన విధేయురాలు, విశ్వాసి, విరక్తత్వ ప్రియ మార్గదర్శి, దైవాంకిత, రక్షణమూర్తి. ఆ తల్లికి ఇవ్వబడిన గౌరవం ఆమె బిడ్డలైన మానవ సంతతి అంతటికి ఇవ్వబడిన గౌరవమే. జన్మపాపం లేక జన్మించి, పవిత్ర పుణ్యమూర్తిగా జీవించి, రక్షణకార్యంలో దేవునికి భాగస్వామియై సహకరించి దైవప్రణాళికను దిగ్విజయమొనర్చడంలో గుంభనంగా ప్రార్థనతో మనసా వాచా కర్మణా తనవంతు పాత్రను నిర్వహించిన ఆ నిత్య కన్య మరియాంబకు తగిన గౌరవం ఇవ్వబడింది. జీవితంలో ఆమె ఒక్క క్షణంకూడ దేవునికి దూరం కాలేదు. అశ్రద్ధ, బద్ధకం, వాయిదా వేయడం అనేది లేకుండా నిరంతరం దేవుని ప్రేమించి ప్రార్థించింది. పరోపకారిణి, కృపావర్షిణి, దేవునికి సాక్షిగా నిలచిన సబల. ఈ అంశాల్నే 3వ పౌలు పోపుగారి నేతృత్వంలో క్రీ॥శ॥ 1545లో జరిగిన ట్రెంటు క్రైస్తవ మహాసభ దృవీకరించి, కీర్తించి తమ గౌరవాన్ని ఇనుమడింపచేసుకుంది. త్రియేక దేవుని తర్వాత ఉన్నతస్థానం ఆమెదేయని వెల్లడిచేసింది. "రాణి మేలిమి బంగారు నగలతో కైసేసికొని నీ కుడిపార్శ్వమున నిలుచుండును" (కీర్తన 45:9)

దేవుడే ఆ తల్లిని అంతగా గౌరవిస్తే ఇక పాపాత్ములమైన మానవులు ఎంతగా గౌరవించాలి? దేవదూతే ఆమెకు నమస్కరించింది (లూ. 1:5) ఆమె చేసిన దేవుని స్తోత్రగీతం (లూ. 1:46-55) ఆమె తరతరాలవారికి ధన్యురాలని ముద్రవేసింది. సూర్యుడే ఆమె వస్త్రములు. చంద్రుడు ఆమె పాదపీఠం. ఆమె శిరముపై పండ్రెండు నక్షత్రములు గల కిరీటము ఉండెను విషసర్ప సైతాను తల నలుగగొట్టిన మహత్వ్యం ఆమెది.

మరియతల్లి ఈ లోకంలో అనేక పర్యాయాలు దర్శనమై మానవుల్ని యేసుక్రీస్తువైపు మరల్చ సందేశాలిచ్చింది. ముఖ్యంగా లూర్ధు, ఫాతిమా, లాసలత్తె, గ్వాదాలుప్, వెళాంకణ్ణి దర్శనాలు పేరెన్నికగన్నవి. పునీత బెర్నార్డ్, పునీత ఎఫ్రేమువంటి మరెందరో, దేవమాత భక్తులు మనకు ఆదర్శనీయులు. పునీత బెర్నార్డుచేసిన "దేవమాత శరణుగోరు జపము" శ్రీసభ ప్రాతఃకాల ప్రార్థనలో చేర్చి తన బిడ్డలకు తల్లి దీవెనలందిపజేస్తుంది. శనివారం ఆ తల్లికి కేటాయించి దేవమాతభక్తిని ప్రోత్సహిస్తోంది. మే నెల దేవమాత పూజిత మాసంగా, అక్టోబరు మాసాన్ని జపమాల మాత నెలగా శ్రీసభ ఏర్పరిచింది. ఆ తల్లి అడుగుజాడల్లో దేవుని సుముఖమునకు చేర్చ తన బిడ్డల్ని చైతన్యం చేస్తోంది.

# ఆదర్శ గురువు: పునీత జాన్ మరియ వియాన్ని
## (ఆగష్టు 04)

దుర్భరమైన కాలమది. మతాధికారుల యెడల తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతున్న రోజులవి. మత విశ్వాసం యెడ మక్కువ కోల్పోయి విచ్చలవిడిగా ప్రజలు సంచరిస్తున్నారు. ఫ్రెంచి విప్లవం చెలరేగి యూరపును కుదిపేసిన దినాలవి. అట్టి గడ్డు పరిస్థితుల్లో ఫ్రాన్సుదేశం నైరుతి ప్రాంతమైన లయన్సు నగరానికి ఆరుమైళ్ళ దూరంలో ఉన్న దర్టిల్లీ గ్రామంలో జాన్ మరియ బాప్టిస్ట్‌వియాన్ని జన్మించారు. తండ్రి మాథ్యూ. వ్యవసాయి. వియాన్ని బాల్యం అంతాకూడ వ్యవసాయ పనుల్లోనే గడిచింది. ఇతని సోదరి కాథరీన్ పెళ్ళికి ధనం సమకూర్చుకోవడంలోనే తండ్రి తలమునకలయ్యేవాడు. తమ పేదరికంవల్ల కుమారుడు జాన్ మరియను చదివించక పెద్దగా పట్టించుకోలేకపోయాడు. అయితే డ్యూజోవర్ పాయింట్‌లో నివసిస్తున్న తన తల్లి తరపు తాతగారింట్లో ఉండి ప్రాథమిక విద్య అభ్యసించాడు. ఎంతైనా చదువులో రాణింపు లేక చాలా వెనుకబడిఉన్నాడు.

మరియ వియాన్ని తన 13వ యేట ప్రథమ దివ్యసత్ప్రసాదాన్ని లోకొన్నారు. క్రమంగా గురువు కావాలన్న కాంక్ష వారిలో తీవ్రమైనది. 1806లో 'ఈ కల్లీ' విచారణ గురువైన చార్లెస్ బాల్లీగారి వద్ద ఉండి గురు శిక్షణ విద్యగరిపారు. లాటిను భాష, గురు విద్యాంశాలు నేర్చుకున్నారు. తనకు 20 ఏళ్ళు వచ్చినా చదువు తనకు అబ్బడంలేదు. అందువల్ల అప్వస్థతకుకూడ గురయ్యేవారు. 1803లో నెపోలియన్‌కూ ఏడవ పయస్ పోపుగారికీ జరిగిన ఒప్పందం ప్రకారం గురువిద్యార్థులు విధిగా సైనికశిక్షణలో చేర్చాల్సిన అవసరంలేదు. కాని ఏదో పొరపాటు జరిగి మరియవియాన్నికి సైన్యంలో చేరమని కాగితాలు జారీ అయ్యాయి. తప్పని పరిస్థితుల్లో 1809 అక్టోబరు 26న సైన్యంలో చేరాడు. కాని జబ్బున పడి ఇంటికొచ్చేశాడు. మళ్ళీ చార్లెస్ బాల్లీ గురువు వద్దనే చదువు కొనసాగించారు.

1813 అక్టోబరు నాటికి లయన్సు పట్టణంలో నెలకొన్న ఇన్యాసిగారి గురు విద్యాలయంలో చేరేందుకు విద్యార్హతనొంది అందు ప్రవేవించారు. లాటిను భాషనేర్వడం కష్టమైంది. తొమ్మిది మాసాల పరీక్షలో అన్నింటిలో వెనుకబడిపోయారు. పెద్దలు ఇంటికి పంపేయాలనుకున్నారు. కాని వీరి గురువు బాల్లీగారి సిఫారుసు మేరకు గురువిద్యలో ఉండనిచ్చారు. 1815 ఆగష్టు 13న గ్రెనోబుల్ పట్టణ దేవాలయంలో

గురు పట్టాభిషిక్తులయ్యారు. అక్కడే ప్రథమ దివ్యబలి పూజనర్పించారు. అప్పటికి వాటర్లూ యుద్ధం జరిగి రెండు నెలలు దాటింది. వీరి గురు పట్టాభిషేకానికి అనుమతించే ముందు లయన్సుకు చెందిన వికార్ జనరలుగారు "శ్రీసభకు బాగా విధ్వాంసులైన గురువులు మాత్రమేకాదు దైవసేవకు అంకితమైపోయే గురువులుకూడా చాలా అవసరం" అని నొక్కివక్కాణించారు. పిమ్మట ఫాదర్ జాన్ మరియవియాన్నిగార్ని ఈ కల్లీ విచారణకు బాల్లీ గురువర్యులకు సహాయకులుగా పంపిచారు. బాల్లీ స్వామి 1817 డిశంబరు 17న మరణించగా రెండు మాసాలనంతరం లయన్సు నగరం సమీపంలో 'ఆర్స్' అనే ఓ మారుమూల గ్రామంలో విచారణ గురువుగా నియమితులయ్యారు. అప్పటికివారు వయస్సు 32 సం॥లు.

ఆర్స్ గ్రామంలో అప్పటికే క్రైస్తవ విలువలు క్రిందిస్థాయికి దిగజారాయి. వాళ్ళల్లో అంతరించిపోయిన క్రైస్తవ విశ్వాసాన్ని మరలా వెలిగించాల్సిన బాధ్యత ఫాదర్ వియాన్ని పైబడింది. ప్రారంభంలో విచారణలోని పేదలు, రోగుల్ని పరామర్శిస్తూండేవారు. తరచూ గంటలు తరబడి దివ్య సత్ప్రసాదం ఎదుట మోకాళ్ళూని తన విచారణ ప్రజలు మనో పరివర్తనకై ప్రార్థించారు. ఆర్స్ గ్రామంలో పెద్దకట్టడమంటే అక్కడి చిన్ని గుడి మాత్రమే. స్త్రీలు, పిల్లలు మాత్రమే ఆదివార దివ్యపూజలకు వస్తూండేవారు. అందువల్ల పొలాలకు కూడా పోయి గుడికి రాని ప్రజలయొద్దకు వెళ్ళి వారి మధ్యాహ్నా భోజనసమయంలో వారి మధ్యచేరి నచ్చుజెప్పేవారు. జాన్సనిజమ్‌వల్ల అడుగంటిన విశ్వాసాన్ని వారిలో ప్రోదిచేశారు. తయారుచేసుకున్న తన ప్రసంగాలతో, మంచి పాపసంకీర్తనలతో ఆదర్శ సందేశాలలో ఆర్స్ విచారణ రూపురేఖల్నే మార్చివేశారు. రానురాను ఆదివారం నాటి దివ్యపూజకు మగవాళ్ళు కూడ రావడం ఆరంభమైంది. ఫాదర్ వియాన్ని ఇచ్చే ఆధ్యాత్మిక శిక్షణలో వాళ్ళంతా ఎంతో చక్కగా పొల్గొనేవారు.

బోధించడంలో వియాన్నీ ఆనాటి బోధకులలోకెల్లా మేటి బోధకుడనిపించుకున్నారు. గురువుల శిక్షణకు సరియైన సదుపాయాలు లోపించిన రోజుల్లోకూడ వారు శ్రమించి అంతటి అర్హతను సముపార్జించారు. ఫ్రెంచి విప్లవ సమయంలో ఆధ్యాత్మికాభివృద్ధి కుంటుబడటం వల్ల మత పుస్తకాల సదుపాయం లభ్యమయ్యేదికాదు. వియాన్నిగారు 1750లో తౌలన్ పీఠాధిపతులైన డిచౌన్‌గారిచే

గురువిద్యార్ధులకై గురుతర సూచనలు చేస్తూ ప్రచురించబడిన చిరుపుస్తకాన్ని చదివి గతంలో తాను గురుపట్టమొందడానికి కావాల్సిన పరిజ్ఞానాన్ని ప్రోదిచేసుకున్నారు. ఏ విధంగా చూసినా వారు అంతగా చదువురాని గురువుల కోవకే చెందుతారు. తన ముక్కుసూటి పట్టుదలవల్ల త్రాగుడు, నృత్యం పనికిరాదని అవి పాపానికి హేతువులని పట్టుబట్టగా క్రైస్తవులచే తిరస్కరింపబడి కష్టాలపాలయ్యారు. తిరిగి వారి ప్రార్ధన భక్తిచూసి క్రైస్తవులు వియాన్నిగార్ని అంగీకరించారు.

వియాన్నిగారు ఆర్స్ దేవాలయాన్ని గొపురంతోను పెద్ద పీఠంతోను విస్తరింపచేసి విశ్వాసులందరి ప్రవేశానికి దోహదంచేశారు. అనాథలకు, దిక్కూ మొక్కూలేని బాలికలకు దేవాలయం దాపున ఒక పాఠశాల ప్రారంభించారు. వారికి పొలం పనులు, గృహ సంబంధ పనులు కూడ నేర్పించేవారు. వీటి నిర్వహణకై లయన్స్ నగరవీధుల్లో బిక్షాటనచేసి ఆర్థిక వనరులు సమకూర్చేవారు. వియాన్నిగారు పవిత్రాత్మ సహకారంతో పాప సంకీర్తనలు ఆలకించి వారి వారి ఆత్మీయ అవసరాలకు తగినట్లుగా ఆధ్యాత్మిక సూచనల్ని ఎంతో నేర్పుగా ఇస్తున్నారన్నవార్త అంతటా వ్యాప్తించింది. వారు పశ్చాత్తాప పడని పాపాల్ని గురించికూడ పాపసంకీర్తన చేసేవారికి జ్ఞప్తికి తెచ్చి ప్రార్థించేవారు. వీరి ప్రార్థనలవల్ల ఆత్మారోగ్యంతో పాటు శారీరక స్వస్థలుకూడ సమకూరడం భక్తులనబ్బుర పరిచింది. ఈ విషయం యూరపు అంతట ప్రాకి ఫాదర్ వియాన్నిగారి వద్ద పాపసంకీర్తన చేయడం కోసం ఒక యాత్రలా విశ్వాసులు రావడం మొదలైంది. రోజుకు 14 నుండి 18 గం॥ వరకు వియాన్ని గారు ఓపికతో పాపసంకీర్తన సంస్కారమందించేవారు.

వియాన్నిగారు తన నడివయస్సులో నుండగా సాతాను చాలాసార్లు బాధపెట్టింది. వారి ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీసింది. భయంకరమైన శబ్దాలు, దృశ్యాలు, గొడవలతో వేధించింది. 1824 శీతాకాలంలో మొదటి సంఘటన జరిగింది. రాత్రుళ్ళు గుడితలుపులు బాదుతున్నట్టు, దొడ్లోనుండి ఏవో వింత అరుపులు సైనికుల పెడబొబ్బలు భయానకంగా విన్పించేవి. తెల్లారాక చుట్టప్రక్కల వారి నడిగితే తమకేమీ ఆ ధ్వనులు వినబడలేదనేవారు. అప్పుడు వారికర్థమైంది ఇది సాతాను పనియని. దేవుడు తన బిడ్డలను భయపెట్టడని చెప్పారు. ఇలా 12 సం॥లు సాతానుతో ఘర్షణపడి చికాకు నిద్రలేమివల్ల పళ్ళసలుపు, ముఖం పాలిపోవడం, కడుపులోనొప్పి ఇతర రోగాలు చుట్టుకుని వృద్ధిడిలా కన్పించసాగారు. తన వృద్ధాప్యంలోకూడా పిల్లలకు సత్యోపదేశం నేర్పించేవారు. పెద్దలకు

మంచి ఉపన్యాసాలతో గురుత్వ సేవలందించేవారు. పాతబడి చిన్నయిల్లు, సామాను అంతగాలేని చిన్నగదిలో కాలం వెళ్ళబుచ్చేవారు.

వియాన్నిగారి పేరు ప్రతిష్టలు ఫ్రెంచి ప్రభుత్వ దృష్టికికూడ వచ్చాయి. 1850లో "ఇంపీరియల్ ఆర్డర్ ఆఫ్ ది లీజియన్ ఆఫ్ ఆనర్" అనే వీరయోధ బిరుదును ప్రకటించింది. దానికి 12 ఫ్రాంకులు రుసుము చెల్లించాలని తెలిసినప్పుడు "ఆ పండ్రెండు ఫ్రాంకులతో పండ్రెండు మంది పేదలకు అన్నదానం చేయవచ్చుకదా! అని దాని పట్ల ఉదాసీన భావాన్ని వెలబుచ్చారు. ఆ గౌరవ హోదాకు చిహ్నంగా ప్రభుత్వం వారిచ్చిన "రిబ్బను" వారేనాడూ ధరింపరైరి. వారి మరణానంతరము దానిని వారి చొక్కాకు తగిలించారు.

1845లో సాతాను వియాన్నిగార్ని బాధపెట్టడం మానేసింది. ఆర్స్ విచారణలో 41సం॥లు సేవలందించాక చివరి రోజుల్లో కేవలం 3 వారాలు మాత్రమే జబ్బునపడ్డారు. అస్వస్థతలో తానిక 3 వారాలు మాత్రమే జీవిస్తానని తన మరణంగూర్చి ముందుగానే తెల్పారు. అలాగే జరిగింది. 1859 ఆగష్టు 4న పరమపదించారు. అంత్య సమయంలో పీఠాధిపతి, ఇరవై మంది గురువులు వారి మంచం చుట్టూ నిలబడి ప్రార్థన చేశారు. ప్రశాంతంగా వారి దేహయాత్రను చాలించడం చూశారు.

1950 జనవరి 9న పదవ పయస్ పోపుగారు వియాన్నిగారికి ముక్తి భాగ్య పట్టాకట్టారు. తరువాత 1955 మే 31న పదకొండవ పయస్ పోపుగారు పునీత పట్టాభిషిక్తులను గావించారు. గురువంటే ప్రజల మనిషని ప్రజల అవసరాలకు మించిన మరేపని గురువులకు ముఖ్యంకాదని పునీత వియాన్నిగారి జీవితాదర్శం తెల్పుతోంది. అందుకే వీరిని విచారణ గురువుల పాలక పునీతులుగా శ్రీసభ గుర్తించింది.

**ధ్యానాంశం:**

దేవునికి సమర్పించకుండా, మనం ఏంచేసినా అది వ్యర్థమే. (పునీతజాన్ మరియ వియాన్ని)

# విచారణలో మౌలిక క్రైస్తవ సంఘాలు

**ఉపోద్ఘాతము**

మౌలిక క్రైస్తవ సంఘం అంటే ఏమిటి? దీనికి పునాది ఉన్నదా? అని పరిశీలించినట్లైతే ప్రభు శిష్యులు ఆరంభంలో స్థాపించి నడిపించిన సంఘం యిదే. దీని ఆనవాళ్ళు మనకు అపోస్తులకార్యంలో క్షుణ్ణంగా కనిపిస్తాయి.

**పరిశుద్ధ గ్రంథంలో క్రైస్తవ సంఘం**

మౌలిక క్రైస్తవ సంఘాలు గురించి తెలుసుకొనేముందు ఆనాటి ప్రథమ క్రైస్తవ సంఘాలు ఎలా జీవించాయో పరిశీలిద్దాం.

"విశ్వసించిన వారందరు కలసి సమిష్టిగా జీవించుచూ, తమకు కలిగిన దానిలో అందరు పాలుపంచుకొనుచుండిరి" (అపో. 2:44) క్రీస్తు సంఘము ప్రతిదినము కూటముగా దేవాలయములో కలుసుకొనుచూ, తమ ఇండ్లలో రొట్టెను విరచుచూ సంతోషము, వినయము గల హృదయములతో భుజించుచూ దేవుని స్తుతించుచూ" (అపో. 2:6-47) ఉండిరి. అన్నిటికంటే ముఖ్యముగా వారు అందరూ ఒకే మనస్సుతోను, ఒకే హృదయముతోను జీవించుచుండిరి... వారికి ఉన్నదానిని అందరు పంచుకొనుచుండిరి. ఆ సమయంలో ఏ ఒక్కనికిని కొరతలేదు. ఏలయన వారికున్న స్థిర ఆస్తులను అమ్మి, వచ్చిన పైకమును వారు అపోస్తుల వద్దకు తెచ్చుచుండిరి. వారు పైకమును వారివారి అవసరములకు తగినట్లు పంచి ఇచ్చెడివారు. ఇదే క్రీస్తు ఆశించిన దైవరాజ్యమని ఆది క్రైస్తవుల జీవిత విధానం స్పష్టం చేయుచున్నది.

ఆది క్రైస్తవ సంఘాలకు మౌలిక క్రైస్తవ సంఘాలకు ఉన్న సంబంధం ఏమిటి? అని పరిశీలించిన నేడు తొలినాటి క్రైస్తవ సంఘం వలె జీవించుటకు ఎర్పడ్డ చిన్న క్రైస్తవ సంఘాలే మౌలిక క్రైస్తవ సంఘాలు. వీటి యొక్క ప్రధాన కర్తవ్యం దైవరాజ్య వ్యాప్తి ప్రేమరాజ్య స్థాపన. ఈ నవీన యుగంలో పవిత్రాత్మ దేవుడు మౌలిక క్రైస్తవ సంఘాలను శ్రీసభలో ఆదర్శప్రాయంగా మలచాడు. తద్వారా శ్రీసభ ఈ లోకంలో ఒక మధ్యవర్తిగాను మరియు దివ్యరక్షణ సంస్కారముల ద్వారా అనుదినము మనలను నడిపిస్తుంది. మౌలిక క్రైస్తవ సంఘాలు పరలోకరాజ్య ప్రతిబింబాలు. శ్రీసభ దైవరాజ్యం యొక్క మొదటిఫలం.

**శ్రీసభలో మౌలిక సంఘాలు**

ఆదిమ క్రైస్తవసంఘం జీవితవిధానం ఈ మౌలిక క్రైస్తవ సంఘాలలో కార్యరూపందాలుస్తారు. మౌలిక సంఘంలో "సకల వస్తువుల కంటే సర్వేశ్వరుని అధికముగా ప్రేమించుదువు గాక, నీ వలే సమస్తజనులను ప్రేమించుదువుగాక". అనే

ఆజ్ఞలు కూడా క్రియారూపం దాల్చుతాయి. అందువలననే శ్రీసభ మనలను మౌలిక సంఘాలను స్థాపించమని సర్వమానవాళి శ్రేయస్సు కోసం పాటుపడమని అర్థిస్తుంది.

1. తెర్తూలియన్ అనే సుప్రసిద్ధ రచయిత, సమాజంలో ఉన్న పేదలు, అనాథలు ఆశ్రమంలో ఉన్న వారందరిని క్రైస్తవ సంఘాలు ఆదుకొనే విధానాన్ని చూసి, అన్యమతాల వారు అచ్చెరువొందే వారని చెప్పారు.

2. సంఘీభావమే శ్రీసభకు ఊపిరి, గనుక శ్రీసభకు అత్యంత సన్నిహితంగా శ్రీసభలో అంతర్భాగంగా కొనసాగే మౌలిక క్రైస్తవ సంఘాలు శ్రీసభ సంఘీభావానికి సాక్షులుగా నిలుస్తాయి. శ్రీసభలో ఎకతాభావాన్ని పెంపొందించి సుసంఘటితం చేస్తాయి. ఇలా నియమబద్ధంగా నడిచే ఈ మౌలిక క్రైస్తవ సంఘాలే శ్రీసభకు ఆశాకిరణాలు. జరిగిన ప్రపంచ పీఠాధిపతుల అసాధారణ మహాసభ అంతిమ నివేదిక.

3. ఈ మౌలిక సంఘాలే శ్రీసభ చైతన్యానికి సజీవ సాక్షులుగా నిలుస్తున్నాయి. విశ్వాస వికాసానికి, సువార్తా ప్రచారానికి దోహదకారులవుతున్నాయి. ఈ మౌలిక సంఘాలే ప్రేమ పునాదుల మీద నిర్మించే మరో ప్రపంచానికి నాంది ప్రస్తావనలవుతున్నాయి. మౌలిక క్రైస్తవ సంఘాలు సదా గురుమండల, క్రైస్తవ సంఘములో అంతర్భాగంగానే కొనసాగుతాయి. అంతేకాదు ఇవి గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో నెలకొని వారిని చైతన్యవంతులను చేస్తూ, పేద, బడుగు, అనాథులకు ఇతోధికముగా సేవలు చేస్తాయి. మౌలిక సంఘాలు వ్యక్తులను సంఘటిత శక్తులుగా మలుస్తాయి. క్రీస్తు ప్రేమ సందేశాన్ని తమ జీవన పథంగా మలచుకున్న ఈ సంఘాలు, జాతి, వర్ణ, వర్గ, వివక్షలకు అతీతంగా వ్యవహరిస్తాయి. రెండవ జాన్‌పాల్ పాపుగారి విశ్వలేఖ ('సువార్తా ప్రబోధం శ్రీసభ ధర్మం' – 51)

4. ఆనాటి తొలి సంఘంలోని క్రైస్తవ విశ్వాసుల మధ్య ఉండే ఆర్థికపరమైన సమానత్వం, సంఘీభావం క్రమేణా సన్నగిల్లుతూ వచ్చాయి. కానీ ఆదర్శ క్రైస్తవ సమాజం తాలుకు మౌలికభావాలు మాత్రం యథాతథంగా నిలిచి యున్నాయి. వీటి ప్రకారం క్రైస్తవ సంఘంలో పేదరికానికి చోటు లేదు. మానవుడు సమాజములో గౌరవముగా జీవించుటకు మరియు కనీస అవసరాలు తీర్చుకొనేందుకు తగిన వనరులను కల్పించాలి. విశ్వాసులలో ఏ ఒక్కరూ పేదరికం కారణంగా నిరాదరణకు గురికాకూడదు. ఈ క్రైస్తవ సహవాస మహాదాదర్శాన్ని ఆచరించడానికి అపోస్తులుల సారధ్యంలో తొలి క్రైస్తవ సంఘాలు చిత్తశుదితో కృషిచేస్తూ వచ్చాయి. (16వ బెనడిక్టు జగద్గురువుల తొలి విశ్వలేఖ.)

**మౌలిక క్రైస్తవ సంఘ లక్షణాలు**

కతోలిక క్రైస్తవ భక్త జనుల విశ్వాసానికి పట్టుకొమ్మలు పరిశుద్ధ గ్రంథం మరియు శ్రీసభ సంప్రదాయం. కనుక విశ్వాసుల విశ్వాస వికాసానికీ భక్తి జీవనాభివృద్ధికి పరిశుద్ధగ్రంథ పఠనం ధ్యానం తప్పనిసరని శ్రీసభ మనకు బోధిస్తుంది.

శ్రీసభ ఉపదేశాలకు, ద్వితీయ వాటికన్ మహాసభ సద్బోధలకు అనుగుణముగానే ఆధునిక శ్రీసభలో పరిశుద్ధ గ్రంథపఠన ధ్యానాల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధాభక్తులు చూపడం జరుగుతుంది. బైబిలు ప్రార్థనల ఆధారంగా "మౌలిక క్రైస్తవ సంఘాల వంటి సరికొత్త భక్త సంఘాలు ఏర్పడ్డాయి. సువార్తాప్రచారం ఎడల ఆసక్తి, సువార్తా ప్రచారం గురించి "సువార్తా ప్రబోధం శ్రీసభ ధర్మం" అనే విశ్వలేఖలో చాలా చక్కగా వివరించి చెప్పబడింది. సువార్తా ప్రచారంలో పునీత పౌలుగారి ఆవేదన మనందరి ఆవేదన కావాలి. "సువార్తను బోధించకున్నచో నా పరిస్థితి ఎంతో దారుణమగును" ప్రస్తుత సమాజములో క్రైస్తవ మౌలిక సంఘాలు ఎంతైనా అవసరము, ఎందుకనగా ఇవి పేదల పాలిట పెన్నిధులు వాటి కార్యక్రమములను నేటి పేద ప్రజలకు అనువుగా ఏర్పాటు చేయాలి.

**మౌలిక క్రైస్తవ సంఘాలు - సహాయ కేంద్రాలు**

రెండవ వాటికన్ మహాసభ క్రైస్తవులంతా కలసి ఆదర్శ సంఘంగా జీవించాలని కోరుచున్నది. ఈ ఆదర్శ సంఘాలలో ఒకటైన మౌలిక క్రైస్తవ సంఘాలు మూడవ సహస్రాబ్దంలో నూతన ఉత్తేజముతో క్రీస్తు ప్రబోధించిన మహాదాశయాలవైపు, నవజీవన విలువలు అలవరచుకొంటూ ప్రపంచానికి ఒక నూతన సందేశాన్ని అందిస్తుంది. అవి జీవించే విధానం క్రీస్తులో జీవించే విధానం కావాలి.

ఈ మౌలిక సంఘాలు అన్నీ ఒకే విధమైన కార్యక్రమాలు చేపట్టాలనే నియమం లేదు కావున ఒక్కొక్క మౌలిక సంఘం చేపట్టే కార్యక్రమాలు ఒక్కో విధంగా వుంటాయి. కొన్ని సంఘాలు కేవలం తమ సంఘంలోని సభ్యుల సమస్యలు, మరియు తన ఇరుగుపొరుగు వారి యొక్క చిన్నచిన్న అవసరాలను మాత్రమే తీర్చగలిగే స్థితిలో వుండవచ్చు. మరికొన్ని సంఘాలు, విచారణ, మరియు రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యల్ని కూడా చర్చించే స్థితిలో వుండవచ్చు. సంఘములోని సభ్యులను బట్టి, వారి పరిస్థితులను బట్టి వారు చేపట్టే కార్యక్రమాలుంటాయి. కానీ ప్రతి సంఘం క్రమేణ ఎదగుతూ తమ దృష్టిని, జాతీయ, అంతర్జాతీయ విషయాలు చర్చించే స్థితికి ఎదగాలి. దీనికి ఎంతో సమయం, శిక్షణ అవసరం.

**మౌలిక సంఘాలు చేపట్టే కార్యక్రమములు**

1. సువార్తా ప్రార్థన
2. వ్యాధిగ్రస్తులను సందర్శించడం, సహాయం అందించడం

3. కుటుంబాలను సందర్శించడం
4. వివాహం వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం
5. అవసరాలలో వున్న వారిని ఆదుకోవడం
6. స్వయం సహాయక కార్యక్రమాలు చేపట్టడం
7. సత్యోపదేశం నేర్పించుట

## మౌలిక సంఘాలు చేయగలిగిన ఇతర కార్యక్రమాలు

1. దేవాలయమునకు రావటం, మానివేసిన క్రైస్తవులకు నచ్చచెప్పడం
2. రోగులకు, వృద్ధులకు దివ్య సంస్కారాలు ఇప్పించడం
3. కాబోయే వధూవరులకు వివాహ సంస్కారాలు గురించి బోధించడం
4. పేదలకు, వృద్ధులకు సహాయం అందించడం
5. గ్రామంలో శాంతి స్థాపనకు కృషి చేయడం
6. ఖైదీలను సందర్శించడం
7. అన్యాయాలను తొలగించడానికి శాంతియుతంగా పూనుకోవడం

### మౌలిక సంఘ ఏడుదశల ప్రార్థన

మౌలిక సంఘానికి ఒక ఉజ్జీవకుడు వుంటాడు. ఉజ్జీవకుడు నాయకుడు కాదు. ఉజ్జీవకుడు అంటే ప్రేరేపించేవాడు, చైతన్యము కలిగించేవాడు. ఉజ్జీవకుడు ఏడు దశల ప్రార్థనకు అందరిని ఒక ప్రదేశంలో చేరమని తెలియజేస్తాడు. అందరు సమయానికి ఆ ప్రదేశంలో సమావేశమై గుండ్రముగా కూర్చుంటారు. గుండ్రముగా కూర్చోవటంలో గొప్ప భావం వుంది. ఇది అందరు సమానమే అనే భావాన్ని చాటుతుంది. కావున ఈ మౌలిక సంఘాలలో సమభావం ఏర్పడుతుంది. కావున అందరు అన్నదమ్ముళ్ళలా, అక్కచెల్లిండ్రుగా కలసి ప్రార్థిస్తారు. వీరి మధ్య అన్యోన్యభావం ఏర్పడి తమ తమ భావాలను నిస్సంకోచంగా వెల్లడిస్తారు.

మౌలిక సంఘాలని, ఏడుదశల ప్రార్థనను విడదీసి మాట్లాడలేము. మనం ఆ ఏడుదశలను తెలుసుకుందాం.

**1. ప్రార్థన:** సంఘములోని ఒక సభ్యుడు ఉత్థాన క్రీస్తును ఆహ్వానిస్తూ ప్రార్థిస్తారు.

**2. పరిశుద్ధ గ్రంథపఠనం**

ఎ) పఠనం వివరాలను మూడు లేక నాలుగుసార్లు ఆగి, ఆగి చెప్పాలి.

బి) పఠనాన్ని మూడు లేక నాలుగుసార్లు చదివించాలి.

**3. పరిశుద్ధగ్రంథ పరిశీలన**

ఎ) పఠనంలోని మనస్సు కదిలించిన వాక్యాన్ని వల్లించాలి. ఈ వాక్యాన్ని బంగారువాక్యం అని కూడా అంటారు. సంఘములో సభ్యులు వారి వారి మనస్సుకు తోచిన వాక్యాన్ని మూడుసార్లు పెద్దగా, చిన్నగా, మరి చిన్నగా ఉచ్చరించాలి.

**4. మౌనధ్యానం**

కొద్దినిమిషాల పాటు పఠన వచనాల ద్వారా ప్రభువు నాతో వ్యక్తిగతంగా నాకు చెప్తున్న విషయం ఏమిటని మనస్సులో ధ్యానించాలి.

**5. ప్రభువు ప్రేరణ**

ఈ దశలో ప్రభువు మనకిచ్చిన సందేశమేమిటో క్లుప్తంగా అందరితో పంచుకోవాలి. కాని ఇక్కడ మనం గుర్తుంచుకోవలసిన విషయం ఒకటుంది. పంచుకోకూడని విషయాలు పంచుకోకూడదు. ఉదా: పాపసంకీర్తనలో మనం గురువుకు మాత్రమే బయలుపరిచే అంశాలు.

**6. చర్చ**

గతంలో చేపట్టిన కార్యక్రమాల్ని సమీక్షించడం, భవిష్యత్తు కార్యక్రమాలను నిర్ణయించడం.

**7. విన్నప ప్రార్థనలు**

సభ్యులు వారి వారి మనస్సులోని ప్రార్థనలు విన్నపప్రార్థనగా ప్రార్థిస్తారు.

**ముగింపు**

మౌలిక క్రైస్తవ సంఘాలు పేదల పాలిట కల్పతరువులు, చైతన్య కేంద్రాలు, ఆదర్శ సంఘానికి పట్టుకొమ్మలు, గోరంతదీపాలై లోకానికి కొండంత వెలుగునిస్తాయి. వీటిని సంపూర్తిగా నిర్వర్తించినట్లయిన, క్రీస్తు ప్రభువు ఆశించిన దైవరాజ్యము ఏర్పడుతుంది. దేవుని రాజ్యం ఎక్కడోలేదు మీ మధ్యలోనే వుంది అన్నారు. ఆ మాటలు నేరవేరాలంటే ఈ క్రైస్తవ సంఘాలు వికసించాలి. వాటి సువాసనలతో సంఘం, విచారణ, మేత్రాసనం, దేశం, ప్రపంచం విశ్వశ్రీసభ గుబాళించిపోవాలి. అందుకు నడుము బిగించి ప్రార్థిస్తూ పాటుపడే దైవసేవకులు కావాలి. మౌలిక సంఘాల వలన పలు ఉపయోగాలుండుట వలన విచారణలలో ఏర్పాటు చేయ ఆసక్తి కలిగియుండాలి.

దీనిని గమనించిన ఆంధ్ర పీఠాధిపతుల సమాఖ్య మన రాష్ట్రంలో కూడా జ్యోతిర్మయి సంస్థను స్థాపించి దాని ద్వారా మౌలిక సంఘాల స్థాపనకై కృషి చేస్తున్నారు. దీనికి సాక్ష్యంగా ఈనాడు ఆంధ్ర కతోలిక శ్రీసభలో 1800 మౌలిక సంఘాలు ఏర్పడి ఆంధ్ర శ్రీసభకు ఒక స్వయంపోషక సంఘంగా మలచుటకు పరుగులు తీస్తుంది. కావున మన విచారణలో కూడా మౌలిక సంఘాలు స్థాపించుకొని దేవుని రాజ్యాన్ని బలపరచుటకు మనవంతు పాత్ర పోసిద్దామా? రండి, మౌలిక సంఘాలను స్థాపించి పోషించుదాం.

## ఉపదేశులకు జన్మదిన శుభాకాంక్షలు

| | | | |
|---|---|---|---|
| కె. జోసఫ్ | కోరుకొల్లు | 02-08-1982 | |
| జె. జోసఫ్ | ఉప్పులూరు | 04-08-1951 | 9392235513 |
| పి. రాజు | నున్న | 04-08-1951 | |
| బి.తోమాస్ | కైకలూరు | 04-08-1967 | 9391119549 |
| యస్ చంటి | చాట్రాయి | 07-08-1980 | |
| పి. మరియదాస్ | విసన్నపేట | 07-08-1979 | |
| టి. దాస్ | విసన్నపేట | 07-08-1981 | |
| యస్. సుబ్బారావు | మచిలీపట్నం | 07-08-1985 | |
| యమ్. బెర్నాడ్ | ------- | 08-08-1972 | 8096120942 |
| యమ్. ప్రభాకర్ | గుడ్‌మన్‌పేట | 08-08-1965 | 8374163115 |
| జి. సురేష్ కుమార్ | భైరవపట్నం | 09-08-1976 | 9676405038 |
| జి. బెర్నార్డ్ | నున్న | 10-08-1977 | |
| ఎ. శ్యామ్‌సన్ | చిల్లకల్లు | 10-08-1971 | |
| యమ్ దావీదు | కొన్కేపాడు | 10-08-1974 | |
| కె. జోసఫ్ | కలిదిండి | 10-08-1971 | 9704239089 |
| యమ్. అలెగ్జాండం | కొండపల్లి | 10-08-1963 | |
| పి. వేదాంతరావు | కైకలూరు | 10-08-1981 | 9553854853 |
| జె. హృదయరాజు | పోలుకొండ | 11-08-1978 | 9133756335 |
| వి. శ్యాంబాబు | కైకలూరు | 11-08-1968 | 8374155461 |
| ఎ. రాజారావు | నూజివీడు టౌన్ | 12-08-1945 | 9553481661 |
| జి. ఎలిషారావు | నూజివీడు టౌన్ | 13-08-1963 | 9989084338 |
| యమ్. జాన్ బోస్కో | జోజినగర్ | 14-08-1987 | 7702801005 |
| జి. చంద్రయ్య | కైకలూరు | 15-08-1956 | |
| ఇ. విలియం మోజెస్ | పోలుకొండ | 15-08-1945 | 7032515467 |
| డి. జోజి | కోడూరు | 15-08-1957 | |
| టి. దేవిడ్‌రాజు | గుడ్‌మన్‌పేట | 15-08-1947 | 9494764254 |
| జి. పౌలు | పోలుకొండ | 15-08-1956 | 7382026186 |
| కె. లూర్దుస్వామి | జోజినగర్ | 16-08-1970 | |
| పి. బాలస్వామి | ఉయ్యూరు | 16-08-1971 | 9966454636 |
| యస్. సాల్‌మన్‌రాజు | --------- | 16-08-1969 | |
| టి. అగస్టీను | -------- | 18-08-1974 | 9912981094 |
| బి. జోసఫ్ | -------- | 19-08-1969 | 9603354990 |
| యమ్. ఫ్రాన్సిస్ | కలిదిండి | 20-08-1991 | |
| ఎ. ఏసుపాదం | ముదినేపల్లి | 21-08-1971 | 9989059599 |
| ఎ. విజయకుమార్ | రమణక్కపేట | 22-08-1978 | 9989476193 |
| డి. రమేష్ | విసన్నపేట | 25-08-1990 | |
| యమ్. సురేష్ | గుడ్‌మన్‌పేట | 25-08-1984 | 9849593824 |
| జి. చిన్నప్ప | మచిలీపట్నం | 31-08-1959 | |